

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ శ్రీదర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్



అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారాలు చూపాలి

● కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో అర్జీలు సమర్పించే బాధితుల సమస్యలను వెంటనే నాణ్యమైన పరిష్కారాలు చూపాలని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున అర్జీదారులు వచ్చి తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, అధికారులకు విన్నవించారు. వారిని కుర్చీల్లో కూర్చోబెట్టి ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ అర్జీలను స్వీకరించారు. అక్కడికక్కడే జిల్లా అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించేలా ఆదేశించారు. దూరం నుంచి వచ్చే అర్జీదారులకు ఆర్థికంగా తోడ్పాటు ఇచ్చేందుకు కలెక్టరేట్‌లో అన్నా క్యాంటీన్ ఆధ్వర్యంలో టిఫిన్ సౌకర్యం కల్పించారు. అంతేకాకుండా గతవారం సభాభవనం వద్దనే అర్జీలు రాయడం, ఆన్‌లైన్ నమోదు చేసే క్రమంలో అక్కడ స్థలం సరిపోక అర్జీదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పత్రికల్లో కథనాలు రావడంతో వెంటనే కలెక్టర్ స్పందించి పూర్వపు టెంట్‌లోనే అర్జీలు నమోదును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు ఎన్నో వ్యయప్రయాసాల కోర్చి తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశతో వస్తారని అన్నారు. వారందరిని పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రజల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. సమస్యల పరిష్కారంలో తాత్సారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వర్రా కస్టడీ రివిజన్ పిటిషన్ రేపటికి వాయిదా

● వర్రా కేసులో వెంకటరంగారెడ్డికి రిమాండ్

కడప, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా జిల్లా కో-కన్వీనర్ వర్రా రవీందర్‌రెడ్డి కస్టడీ రివిజన్ పిటిషన్‌పై ఎస్సీ, ఎస్టీ కోర్టు(నాల్గవ అనపు జిల్లా న్యాయస్థానం)లో సోమవారం విచారణ జరిగింది. తదుపరి చర్యలకు న్యాయస్థానం 18వ తేదీ బుధవారానికి వాయిదా వేసింది. కాగా గత గురువారం వర్రా రవీందర్‌రెడ్డిని రెండు రోజుల పాటు (13, 14 తేదీలు) పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ కడప సెంట్రల్ జైలు అధికారులకు జడ్జి దీనబాబు ఆదేశాలు ఇచ్చారు. అయితే విశాఖపట్నం సెంట్రల్ జైలులో ఉన్న వర్రాను ఈ ఆదేశాలతో కస్టడీలోకి తీసుకోవడం సాధ్యం కాలేదని... విశాఖపట్నం జైలు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని రివిజన్ పిటిషన్‌ను అదే రోజు ఏపీపీ దాఖలు చేయగా దీనిపై సోమవారం విచారణ జరిగింది. ఈ క్రమంలో విచారణను బుధవారానికి వాయిదా వేశారు. అదేరోజు వర్రా కస్టడీకి ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉందని సమాచారం.

వెంకటరంగారెడ్డికి 14 రోజుల రిమాండ్

వైసీపీ సోషల్ మీడియా జిల్లా కో-కన్వీనర్ వర్రా రవీందర్‌రెడ్డిపై నమోదైన కేసులోనే 57వ నిందితుడిగా ఉన్న గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన వెంకటరంగారెడ్డిని పీటీ వారెంట్ కింద పులివెందుల పోలీసులు అరెస్టు చేసి సోమవారం ఎస్సీ, ఎస్టీ కోర్టు(నాల్గవ అనపు జిల్లా న్యాయస్థానం)లో హాజరుపరిచారు. ఈ మేరకు జడ్జి దీనబాబు వెంకటరంగారెడ్డిని 14 రోజుల పాటు రిమాండ్‌కు ఆదేశించారు.

గుడ్ గవర్నెన్స్ వీక్‌ను విజయవంతం చేయండి : డీఆర్వో



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప కలెక్టరేట్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈ నెల 19వతేదీ నుంచి 24వ తేదీ వరకు జరిగే గుడ్ గవర్నెన్స్ వీక్ (జీజీడబ్ల్యూ) క్యాంపెయిన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం ఢిల్లీలోని భారత ప్రభుత్వ పరిపాలనా సంస్కరణలు మరియు ప్రజా ఫిర్యాదుల విభాగం కార్యాలయం నుంచి గుడ్ గవర్నెన్స్ వీక్ క్యాంపెయిన్ ప్రచార ప్రణాళికపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలు నుంచి ఈ కార్యక్రమానికి డీఆర్వోతో పాటు జిల్లా పరిషత్ సీఈవో ఓబులమ్మ, ఇన్‌చార్జి పీపీవో హజరత్తయ్య, డీఐవో డాక్టర్ విజయ్ కుమార్, డీపీఆర్వో వేణుగోపాల్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. వీడియోకాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం డీఆర్వో మాట్లాడుతూ ప్రశాసన్ గావోన్‌కి ఓర్-2024 కార్యక్రమంలో భాగంగా నిర్వహించే జీజీడబ్ల్యూపై జిల్లాలో విస్తృతమైన అవగాహన పెంచాలన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి, పబ్లిక్ సర్వీస్ డెలివరీని మెరుగ పరచడానికి జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.

నిరాశ్రయులకు ఒకరోజు సేవ చేయండి

● ఇసుక తరలిస్తూ పట్టుబడ్డ వారికి జడ్జి ఆదేశం

చెన్నూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా పెన్నా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డ పలువురికి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అఫెన్స్ కోర్టు జడ్జి హేమాస్రవంతి జానకీరామ్ ఒకరోజు సేవాశిక్ష విధించారు. చెన్నూరు మండలానికి చెందిన పి.గంగయ్య, డి.సుబ్బరాయుడు, కె.సుబ్రమణ్యం, టి.వెంకట మహేశ్‌రెడ్డి, వెంకట సుబ్బయ్య, జి.వెంకటసుబ్బారెడ్డి, కె.వెంకటరమణ ఇసుకను అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డారు. వీరిని జడ్జి ఎదుట హాజరుపరచగా.. నిరాశ్రయులకు, అభాగ్యులకు ఒకరోజు సేవ చేయాలని ఆదేశించారు. కొత్త చట్టాలలో భాగంగా వీరందరికీ సామాజిక సేవచేసే విధంగా శిక్ష విధించారు. వీరికి కేటాయించిన ప్రకారం కడప నగరంలోని మునిసిపల్ మైదానం వద్ద గల ఆర్తి ఫౌండేషన్, ఆజాద్ నగర్‌లో గల బృంద స్ఫూర్తి ఫౌండేషన్, జిల్లా పరిషత్ కార్యాలయం సమీపంలో గల అనాధలు, అభాగ్యులకు ఒక రోజంతా సేవ చేస్తూ వారికి అవసరమైన సహాయ సహకారాలను అందించాలన్నారు. ఈ మేరకు అభాగ్యులు, అనాధలకు వీరు ఒక రోజంతా సేవ చేశారు. కాగా జడ్జి ఇచ్చిన సామాజిక సేవ శిక్షపై పలువురు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



అభాగ్యులకు సేవ చేస్తున్న నిందితులు





రాబోయే 2025 నూతన సంవత్సరానికల్లా ప్రొద్దుటూరు మున్సిపాలిటీని టీడీపీ కైవసం చేసుకుంటుందనే ప్రచారం సాగుతోంది. కచ్చితంగా కౌన్సిల్లో మెజారిటీ సాధించి మున్సిపాలిటీపై టీడీపీ జెండా ఎగురవేయగలమనే నమ్మకంలో టీడీపీ నేతలు ఉన్నారు. కానీ వైసీపీ ఛైర్‌పర్సన్, ఇద్దరు వైస్‌ఛైర్మన్లపై అవిశ్వాసం పెట్టి దించాలా.. లేక మెజారిటీ సభ్యులతో కౌన్సిల్లో తామనుకున్న అంశాల ఆమోదం పొందితే చాలా అనే విషయంపై టీడీపీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆచితూచి అడుగులు వేస్తున్నారని అంటున్నారు. ఛైర్మన్ పదవి దక్కాలంటూ 2/3వ వంతు కౌన్సిలర్లు ఉండాలి. కానీ కౌన్సిల్లో పలు అంశాలు ఆమోదం పొందాలంటే సగానికి కన్నా ఒక్కరు ఎక్కువ ఉన్నా చాలు. ఈ మేరకు మెజారిటీ సభ్యులను తమవైపు తిప్పుకోవడానికి పెద్దగా శ్రమించాల్సిన అవసరం లేదని టీడీపీ భావిస్తోంది.

టీడీపీ కైవసమయ్యేనా..?



● మ్యాజిక్ ఫిగర్‌కు చేరువలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు
● కొత్త ఏడాదికల్లా మార్పు ఖాయమంటూ ప్రచారం
● ప్రొద్దుటూరు మున్సిపల్ పీఠం కాపాడుకునే యత్నంలో వైసీపీ నేతలు

ప్రొద్దుటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏపీలో వైసీపీ ప్రభుత్వం దిగిపోయి ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చి 6 నెలల కాలం గడిచిపోయింది. అయినా రాష్ట్రంలో స్థానిక సంస్థలైన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, మండలాలు, పంచాయతీలు అధిక భాగం ఇంకా వైసీపీ చేతిలోనే ఉన్నాయి. అధికారం మారడంతో సహజంగా కొందరు వైసీపీ నుంచి టీడీపీలోకి జంప్ కావడం తప్ప ప్రత్యేకంగా టీడీపీ ఎమ్మెల్యేలు కార్పొరేషన్లు, మున్సిపల్ పాలక మండళ్లను దక్కించుకోవడంపై దృష్టి పెట్టడం లేదు. ఇందుకు కారణం వైసీపీ నుంచి టీడీపీలోకి ఆపరేషన్ ఆకర్ష్ ప్రయోగిస్తే కౌన్సిలర్ల కోసం పెద్దఎత్తున ఖర్చు పెట్టుకోవాల్సి రావడం ముఖ్యమైంది. అంతేకాకుండా మున్సిపల్ కౌన్సిళ్లు ముగియడానికి ఇక కేవలం ఒకటిన్నర సంవత్సరం మాత్రమే ఉంది. పైగా నాలుగేళ్లు పూర్తికానిదే మున్సిపల్ ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు వీలులేదు. అయితే త్వరలో రెండున్నర సంవత్సరాలకే ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే ఆర్డినెన్సును కూటమి ప్రభుత్వం తీసుకురానుందని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. వైసీపీలో ఉన్న అంతర్గత విభేదాలు, నాయకులపై అసమ్మతి, అధికార పార్టీలోకి వెళితే స్వంత ప్రయోజనాలు నెరవేర్చుకోవడంతో పాటు వార్డులో అభివృద్ధికి నిధులు సాధించవచ్చనే ఉద్దేశంతో పలువురు వైసీపీని వీడేందుకు సుముఖంగా ఉన్నారు. ఇలాంటి వారిని పార్టీలోకి లాక్కుని పైసా ఖర్చులేకుండా పాలకమండలిని కైవసం చేసుకోవాలని టీడీపీ నేతలు పావులు కదుపుతున్నారు. అయితే మరికొందరు కౌన్సిలర్లు ఆఖరుదాకా ఉంటే మెజారిటీ కోసమైనా నాలుగు రూకలు రాలుతాయనే ఆశతో వైసీపీలో ఉన్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీని కైవసం చేసుకునేందుకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

మ్యాజిక్ ఫిగర్‌కు చేరువలో..

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో 41 వార్డులు ఉన్నాయి. కేవలం ఒకే ఒక వార్డులో టీడీపీ కౌన్సిలర్ గెలుపొందారు. తక్కిన 40వార్డులను వైసీపీ దక్కించుకుంది. అందులో 11వవార్డు నుంచి ఎన్నికైన రమేశ్ యాదవ్‌కు ఎమ్మెల్సీ పదవి రావడంతో ఆయన రాజీనామా చేశారు. అంటే 40 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అయితే టీడీపీ నుంచి గెలిచిన 33వ వార్డు కౌన్సిలర్ గాజుల శివజ్యోతి సాధారణ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు వైసీపీలో చేరారు. అదేసమయంలో వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లుపై అసమ్మతితో ఉన్న వైసీపీ కౌన్సిలర్లు వంగనూరు మురళీధర్‌రెడ్డి, మునీర్, వైఎస్ మహ్మద్ గౌస్, చింతకుంట సరిత, జంబాపురం వెంకలక్ష్మి టీడీపీ గూటికి వచ్చారు. మరో కౌన్సిలర్ ఇర్ఫాన్ కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల్లో ఘోర పరాజయం పాలవ్వడంతో వైసీపీ నుంచి టీడీపీకి వలసల పర్వం మొదలైంది. పలు విడతలుగా వైసీపీ నుంచి మోపూరి రేవతి, కొవ్వూరు స్వాతి, రాగుల శాంతి, షేక్ కమాల్ బాషా, అలవలపాటి అరుణాదేవి, పల్లా రమాదేవి, చింపిరి అనిల్ కుమార్ రావు, కోళ్ల అరుణ, గాజుల శివజ్యోతి, మీగడ దీప్తి.. మొత్తం ఇప్పటి వరకు 18 మంది టీడీపీలో చేరారు. అయితే కౌన్సిల్లో పైచేయి సాధించాలంటే 40 మందికి గాను 21 మంది ఉండాలి. అంటే మరో ముగ్గురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరితే కౌన్సిల్లో మెజారిటీ వస్తుంది. కౌన్సిల్లో అజెండాలోని అంశాలను ఆమోదించుకోవచ్చు.

అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే..

మున్సిపల్ ఛైర్‌పర్సన్ లేదా వైస్ ఛైర్మన్లపై అవిశ్వాసం పెట్టి పదవుల నుంచి దించాలంటే సభలో మొత్తం సభ్యుల్లో 2/3 వవంతు మెజారిటీ ఉండాలి. అంటే 40 మంది సభ్యుల్లో కనీసం 28 మంది సభ్యులు ఉండాలి. ఇప్పటికే 18 మంది సభ్యులున్నా మరో పది మంది కౌన్సిలర్లు టీడీపీకి అవసరం. వైసీపీలో మరో ముగ్గురు కౌన్సిలర్లు ఇప్పటికే టీడీపీతో టచ్‌లో ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. ఎక్స్‌అఫిషియో సభ్యులైన ఎమ్మెల్యే, ఎంఎల్‌సీ, ఎంపీలకు ఓటుహక్కు ఉంటుంది. ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి కావడంతో ఒక ఓటు టీడీపీకి కలిసి వచ్చినా వైసీపీకి ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేశ్‌యాదవ్ ఓట్లు దక్కుతాయి.

ఏడాదికాలానికి ఎవరిని ఛైర్మన్ చేయాల..

అవిశ్వాస తీర్మానం పెట్టి వైసీపీ ఛైర్‌పర్సన్‌ను పదవి నుంచి దించాక ఎవరిని మున్సిపల్ ఛైర్మన్ చేయాల అనే సందిగ్ధం కూడా టీడీపీలో నెలకొంది. ఇప్పటికే టీడీపీలో మూడు నాలుగు వర్గాలు ఉన్నాయి. ఒకరికి అనుకూలంగా ఛైర్మన్‌ను చేస్తే మరో వర్గంలో అసమ్మతి ఏర్పడక తప్పదు. ఈ పరిస్థితిలో వైసీపీ ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టకుండా కేవలం కౌన్సిల్లో మెజారిటీకి పరిమితం అవుతారని ఎమ్మెల్యే వర్గం భావిస్తోంది.

మున్సిపల్ పీఠం కాపాడుకునే యత్నంలో వైసీపీ

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పీఠం టీడీపీకి దక్కకుండా కాపాడుకునే యత్నాలు వైసీపీ చేపట్టింది. అందులో భాగంగా ఛైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, ఆమె భర్త నాగరాజు టీడీపీలో చేరకుండా వారికున్న ఆర్థిక సమస్యలను పరిష్కరించేందుకు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, ఆయన బావమరిది మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బంగారురెడ్డి పలు యత్నాలు చేపట్టారు. అంతేకాకుండా వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు లబ్ధిపొందిన కొందరు కౌన్సిలర్లను పార్టీ వీడకుండా కట్టడి చేస్తున్నారు. కొందరు కౌన్సిలర్లకు తాము ఎన్నికల్లో పెట్టిన డబ్బులు చెల్లించాకే పార్టీ మారాలని షరతు పెట్టారు. దీంతో మరికొందరు కౌన్సిలర్లు డబ్బులు చెల్లించే పరిస్థితి లేక విధిలేని పరిస్థితిలో వైసీపీతో ఉంటున్నట్లు బహిరంగంగా వెల్లడిస్తున్నారు. టీడీపీలోకి వచ్చేవారికి ప్యాకేజీలు ఇవ్వకపోవడంతో అటు వెళ్లినా లాభమేముంటుందని మరికొందరు వైసీపీలోనే కొనసాగుతున్నారు. ఏది ఏమైనా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ వైసీపీ చేతుల్లో ఉంటుందా ఊడుతుందా అనేది జనవరి నాటికి తేలనుంది.

కడపలో ఊడుతున్న ఫ్యాన్ రెక్కలు

● సీఎం చంద్రబాబును కలిసిన 8 మంది కార్పొరేటర్లు
● త్వరలో మరో 11 మంది టీడీపీలోకి
● ఆరు నెలల్లోనే సొంత అడ్డాలో జగన్‌కు షాక్



సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన కడప కార్పొరేటర్లు

కడప, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సొంత జిల్లాలోనే బిగ్ షాక్ తగులుతోంది. ఆ పార్టీ గుర్తు అయిన ఫ్యాన్ రెక్కలు ఊడిపోతున్నాయ్. నాలుగున్నర సంవత్సరాల తర్వాత జరిగే సాధారణ ఎన్నికల్లో మళ్లీ వైసీపీ వస్తుందన్న నమ్మకం లేక కొందరు.. ఆ పార్టీ నేతలపై ఉన్న తీవ్ర అసంతృప్తితో మరి కొందరు కార్పొరేటర్లు వైసీపీకి బైబై చెప్పి సైకిలెక్కుతున్నారు.

సోమవారం రాత్రి అమరావతిలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే ఆర్.మాధవి ఆధ్వర్యంలో 8 మంది కార్పొరేటర్లు సీఎం చంద్రబాబునాయుడును కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి చంద్రబాబునాయుడు నేరుగా కండువా వేయలేదు. మంత్రి నారా లోకేశ్ పార్టీలోకి ఆహ్వానించనున్నారు. 2వ డివిజన్ కార్పొరేటర్ ఎం.సుబ్బారెడ్డి, 3వడివిజన్ ఎం.మానస, 5వ డివిజన్ నాగేంద్ర, 8వ డివిజన్ ఎ.లక్ష్మిదేవి, 25వ డివిజన్ సూర్యనారాయణ, 32వ డివిజన్ ఎస్‌బీ జఫిరుల్లా, 42వ డివిజన్ సి.స్వప్న, 50వ డివిజన్ కె.అరుణప్రభ కుటుంబ సభ్యులతో కలిసి సీఎం చంద్రబాబునాయుడును కలసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిలో సూర్యనారాయణ ఇప్పటికే టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కడప అభివృద్ధికి సహకరించాలని టీడీపీలో చేరిన కార్పొరేటర్లు సీఎం చంద్రబాబు నాయుడును కోరారు.

ఒకేసారి 8 మంది కార్పొరేటర్లు జగన్‌కు టాటా చెప్పి సైకిల్ ఎక్కేయడం వైసీపీకి కోలుకోలేని దెబ్బ. వారం పది రోజుల్లో మరో 11 మంది కార్పొరేటర్లు టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు. ఈ నెల 21న మాజీ సీఎం వైఎస్ జగన్ బర్త్‌డే. జగన్ పుట్టినరోజును జరుపుకునే సమయంలో సొంత జిల్లాలో ఝలక్ ఇచ్చేందుకు పలువురు వైసీపీ కార్పొరేటర్లను టీడీపీలోకి చేర్చుకునేందుకు పావులు కదుపుతున్నారని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి.

వక్ఫ్‌బోర్డు బిల్లును పునఃసమీక్షించాలి

వివాదాస్పంగా మారిన వక్ఫ్‌బోర్డు బిల్లును పునఃసమీక్షించాలంటూ కార్పొరేటర్ జఫిరుల్లా సీఎం చంద్రబాబునాయుడుకు విన్నవించారు. టీడీపీలో చేరుతున్న సందర్భంగా ఎమ్మెల్యే ఆర్.మాధవి, శ్రీనివాసరెడ్డి, మాజీ కార్పొరేటర్ హబిబుల్లాతో కలిసి వినతిపత్రాన్ని సీఎంకు వినతిపత్రం అందించారు. తప్పకుండా పరిశీలిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు.

విచారణకు హాజరైన వెంకటరామిరెడ్డి

● కలెక్టర్ శ్రీధర్‌కు వివరణ ఇచ్చిన ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు
● ఇది కేసే కాదు.. ప్రశ్నిస్తానని కేసులు, విచారణలు..



కలెక్టర్ ఎదుట విచారణకు హాజరైన ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి

కడప కలెక్టరేట్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి కలెక్టర్ ఎదుట విచారణకు హాజరయ్యారు. ఎన్నికల సమయంలో జిల్లాలో ప్రచారంలో పాల్గొన్నారనే ఫిర్యాదులపై సోమవారం కలెక్టర్ ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని ఆయనకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయన కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు వివరణ ఇచ్చుకున్నారు అనంతరం కార్యాలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో కడప జిల్లాలో నాలుగు ఆర్టీసీ డిపోల వద్ద ప్రచారం చేస్తున్నానంటూ ఫిర్యాదులు వెళ్లడంతో తనను సస్పెండ్ చేశారన్నారు. అందులో భాగంగా కడప జిల్లా కలెక్టర్‌ను విచారణాధికారిగా ప్రభుత్వం నియమించిందన్నారు. ఇందులో భాగంగా కలెక్టర్ అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పానన్నారు. ఎన్నికల సమయంలో తాను ఎలాంటి ప్రచారం చేయలేదని, కొన్ని పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా తనతో పాటు కొందరు ఆర్టీసీ ఉద్యోగులను సస్పెండ్ చేశారని అన్నారు. తమపై కోర్టులో కేసులు కూడా వేశారన్నారు. కలెక్టర్‌కు అన్ని విషయాలు వివరించానని ఆయన పాజిటివ్‌గా స్పందించారన్నారు. ఎన్నికల సమయంలో ఇంకో అసోసియేషన్ నాయకుడు అప్పటి పాలక ప్రభుత్వాన్ని విమర్శించారని ఆయనకు ఒక్క నోటీసుకూడా ఇవ్వలేదన్నారు. కానీ తనమీద అయితే కేసులు, ఎంక్వరీ ఆఫీసర్లు వేశారన్నారు. తాము ఉద్యోగుల పక్షాన పోరాడతామన్నారు. ముందు జాయింట్ స్టాఫ్ మీటింగ్ పెట్టాలని డిమాండ్ చేశారు. సచివాలయాల ఉద్యోగులకు రాజకీయ ఒత్తిళ్లు ఎక్కువయ్యాయని, వారిని వలంటీర్ల కంటే తక్కువగా చూస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వచ్చి 6 నెలలు దాటినా ఇంతవరకు ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగులను గుర్తించి పట్టించుకోవాలని అన్నారు. తనను మళ్లీ రెండుమూడుసార్లు విచారణకు రావాలని కలెక్టర్ కోరారని అన్నారు. కలెక్టర్ మీద నమ్మకం ఉందని, న్యాయ బద్ధంగానే రిపోర్టు ఇస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు.

మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు

● రైతులను మోసగిస్తే చర్యలు : కలెక్టర్

కడప కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు కోసం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలతో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులతో ధాన్యానికి మద్దతు ధరలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా కొంతమంది వ్యాపారులు రైతుల నుంచి చాలా తక్కువ ధరలకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. తేమ శాతం ఎక్కువగా ఉందని వ్యాపారస్తులు రైతులను మోసగిస్తున్నారని అటువంటి వ్యాపారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైతే రైతుల వద్ద నుంచి ప్రభుత్వం ప్రటించిన మద్దతు ధరల కంటే తక్కువకు కొంటున్నారో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రొద్దుటూరు, చాపాడు, ఖాజీపేటలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాణ్యతా ప్రమాణాలను అనుసరించి కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ నాగేశ్వర రావు, పౌరసరఫరాల శాఖ డీఎం అర్జునరావు పాల్గొన్నారు.

హార్సిలీ హిల్స్‌లో.. అభివృద్ధి ఏదీ..

● మొద్దునిద్ర వీడని టౌన్‌షిప్ కమిటీ
● అడుగు ముందుకు పడని ఒబెరాయ్ ప్రాజెక్టు
● ప్రతిపాదనలు దాటని రూ.కోట్ల పనులు
● పర్యాటకులకు రక్షణ కరువు

6



అధికారులను కదిలించిన

'ఆటో గంగమ్మ'

● చేయూతనిస్తామన్న ట్రైబల్ వెల్ఫేర్ కార్పొరేషన్

7

ఫ్లైయాష్ మీదపడి..

● ఆర్టీపీపీ కాంట్రాక్టు కార్మికుడు మృతి
● పరిహారం కోరుతూ.. మెయిన్ గేటు వద్ద ధర్నా

7

ఈ ఇసుక డంపులు ఎవరివి?

● చెరువు చుట్టూ ఇసుక డంపులే
● యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

6



హార్సిలీహిల్స్‌లో.. అభివృద్ధి ఏదీ..?


హార్సిలీహిల్స్ వ్యూ

బి.కొత్తకోట, డిసెంబరు 16: ఆంధ్రా ఊటీగా పేరుగాంచిన ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ప్రస్తుతం అచేతనా వస్థలో ఉంది. ఆహ్లాదకరమైన వాతావరణంతో సముద్ర మట్టానికి 4312 అడుగుల ఎత్తులో ఉన్న ఈ కొండ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వైసీపీ హయాంలో ఇక్కడ పర్యాటకరంగ అభివృద్ధికి పైసా విదల్చకపోగా ఉన్న ఆస్తులనే ధారాదత్తం చేయాలని విఫలయత్నం చేశారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకతో హార్సిలీహిల్స్‌కు ఇకపై మంచిరోజులు వస్తాయనే ఆశలు చిగురించాయి. మరుగునపడిన ఒబెరాయ్ ప్రాజెక్ట్ సీఎం చంద్రబాబు చొరవతో ముందుకు కదిలింది. హార్సిలీహిల్స్ అభివృద్ధికి గతంలో రూపొందించిన మాస్టర్‌ప్లాన్ ప్రకారం జాతీయస్థాయి పర్యాటక కేంద్రంగా గుర్తింపు కోసం చేపట్టదలచిన రూ.కోట్ల పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. హిల్స్ పాలక మండలిగా ఉన్న టౌన్‌షిప్ కమిటీ నిద్రావస్థలో ఉండడంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. కూటమి ప్రభుత్వం దృష్టి పెడితే కొండకు పట్టిన గ్రహణం వీడి జాతీయస్థాయిలో పర్యాటకులను ఆకర్షించే కేంద్రంగా ఉంటుంది.

- మొద్దునిద్ర వీడని టౌన్‌షిప్ కమిటీ
- ముందుకు సాగని ఒబెరాయ్ ప్రాజెక్టు
- ప్రతిపాదనలు దాటని రూ.కోట్ల పనులు
- పర్యాటకులకు రక్షణ కరువు


హిల్స్‌పై ఒబెరాయ్ సంస్థకు కేటాయించిన స్థలం

ముందుకు సాగని ఒబెరాయ్ పనులు

అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఒబెరాయ్ సంస్థకు గతంలో టీడీపీ సర్కార్ హిల్స్‌పై 20.80 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఈ స్థలంలో హెలీప్యాడ్‌తో పాటు రూ.200 కోట్లతో ఫైవ్‌స్టార్ హోటల్ నిర్మించాల్సి ఉంది. అయితే వైసీపీ దీన్ని నీరుగార్చింది. కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు దీనిపై దృష్టి సారించారు. సీఎం ఆదేశాలతో కలెక్టర్ చామకూరి శ్రీధర్ చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ఆగస్టు 27న ఒబెరాయ్ సంస్థ లీగల్ అఫైర్స్ ప్రెసిడెంట్ ఆర్.శంకర్, ప్రాజెక్ట్ కన్సల్టెంట్ నవీన్‌గోస్వామి, ఇంజనీర్ మయాంక్ తనేజలను రప్పించి, కొండ భౌగోళిక స్థితి, విశిష్టతను, హోటల్ నెలకొల్పేందుకు అనువైన పరిస్థితులను వివరించారు. సంస్థకు కేటాయించిన 20.80 ఎకరాల స్థలాన్ని చూపించారు. ఒబెరాయ్ బృందం సంతృప్తి చెంది, బోర్డు మీటింగులో చర్చించి సెప్టెంబరులో నిర్మాణపనులు చేపడతామని చెప్పడంతో హోటల్ నిర్మాణానికి మార్గం సుగమమైనట్లేనని అందరూ భావించారు. అయితే ఏం జరిగిందో ఏమో అది కార్యరూపం దాల్చలేదు.

ప్రతిపాదనలు దాటని అభివృద్ధి ప్రాజెక్టులు

హిల్స్ అభివృద్ధి కోసం ప్రతిపాదించిన ఎన్నో ప్రాజెక్టులు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. 2014లో రోప్‌వే ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఢిల్లీకి చెందిన బృందం సైతం పర్యటించి సర్వే చేసింది. హిల్స్‌పై నుంచి దిగువనున్న అమరనారాయణపురం వరకు విశాఖ తరహాలో రోప్‌వేను నిర్మించాలని భావించారు. అది ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. ఏపీ టూరిజం హరిత రిసార్టుల నిర్మాణానికి రూ.6.50 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అటవీశాఖ ప్రాంగణంలోని జూపార్కులో జంతువులు, పక్షులు తగినన్ని లేవు. అటవీ ప్రాంగణంలోని నాలుగెకరాల బండపై సాహసక్రీడల సముదాయం ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది.

ఘాట్‌రోడ్డులోని మలుపులలో రహదారిని విస్తరించడంతో పాటు రక్షణగోడను నిర్మించాలన్న ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. కొండపై అంత ర్జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేయాలన్న లక్ష్యంతో క్రీడా శిక్షణా కేంద్రం కోసం 3.74 ఎకరాల స్థలం కేటాయించి క్రీడల సముదాయ నిర్మాణం కోసం రూ.3.20 కోట్లు మంజూరు చేయగా, ప్రహరీ మాత్రం నిర్మించి, మిగతా పనులు పెండింగ్‌లో పెట్టారు. ఇందులో వైసీపీ ప్రభుత్వం యాత్ర-2 దర్శక నిర్మాత మహీ వి.రాఘవకు 2.00 ఎకరాలు కట్టబెట్టాలని చూసింది. ప్రస్తుతం జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి క్రీడామంత్రిత్వ శాఖలో ఉన్నా, దీనిపై తగిన చర్యలు తీసుకోలేదు.

శాపంగా నీటిసమస్య... పారిశుధ్య లోపం

హార్సిలీహిల్స్‌లో నీటి సమస్య, పారిశుధ్య లోపం పర్యాటకుల పాలిట శాపంగా మారింది. హిల్స్‌పై బోర్లు వేసే అవకాశం లేనందున దిగువనున్న గాలేటివారిపల్లె వద్ద వేసిన బోర్ల నుంచి నీటిని 5 కి.మీ పైపులైన్ ద్వారా 7 దశల్లో పంపింగ్ చేసి కొండమీదకు తరలిస్తున్నారు. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం కావడంతో తరచూ సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుత అవసరాలకు తగ్గ నీరు సరఫరా కావడం లేదు. కొండపై నీరు కొనాల్సి వస్తోంది. ఈ సమస్య పరిష్కారం కోసం హంద్రీ-నీవా కాలువ ద్వారా దిగువన ఓ చెరువును అనుసంధానం చేసి కొత్తపైపులైనుతో పంపింగ్ కోసం రూ.3 కోట్లతో ప్రతిపాదనలు ఉన్నా నిధులు రాక అమలుకు నోచుకోలేదు. వాటర్ గ్రిడ్ పరిధిలోకి హార్సిలీహిల్స్‌ను తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామన్న కలెక్టర్ మాటలు కార్యరూపం దాల్చాల్సి ఉంది. పారిశుధ్య లోపంతో పర్యాటకులు అసహ్యించుకునే పరిస్థితి నెలకొంది. ప్రధాన రోడ్డు, పర్యాటకులు సంచరించే గాలిబండ లాంటి ప్రదేశాలలో చెత్త చెదారం, మురికినీటి ప్రవాహం హిల్స్ ప్రతిష్టను దిగజారుస్తున్నాయి.

నోటీసులు ఎంత మేరకు ఫలిస్తాయో..

హిల్స్‌పై భూమి స్వాధీనంలో ఉంచుకున్న, నిర్మాణాలు చేపట్టిన వ్యక్తులు, సంస్థలకు బి.కొత్తకోట మండల రెవెన్యూ అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేశారు. తమ స్వాధీనంలో ఉన్న స్థలానికి సంబంధించిన డాక్యుమెంటును చూపించాలని, లేదంటే స్థలాన్ని ఖాళీ చేయించి స్వాధీనం చేసుకుంటామని అంటున్నారు. ఇది ఏ మేరకు సాధ్యమవుతుందో, అధికారులు ఏం చేస్తారో చూడాల్సి ఉంది.



టౌన్‌షిప్ కమిటీ కార్యాలయం ఎదుట దుస్థితి

నిద్రావస్థలో టౌన్‌షిప్ కమిటీ..

హిల్స్‌కు పరిపాలన కేంద్రంగా ఉన్న టౌన్‌షిప్ కమిటీ నిద్రావస్థలో ఉందని పలువురు విమర్శిస్తున్నారు. హిల్స్‌పై పర్యాటక రంగ అభివృద్ధి, ఆస్తుల రక్షణ కోసం చొరవ చూపాల్సిన టౌన్‌షిప్ కమిటీకి సబ్‌కలెక్టర్ ఛైర్మన్‌గా ఉంటారు. ప్రతి మూడు నెలలకు సమావేశం నిర్వహించి అభివృద్ధి కార్యక్రమాలు, నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే సమావేశాలు లేకపోవడం, తగు చర్యలు తీసుకోకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. టోల్‌గేటు నిర్వహణతో ఈ ఏడాది రూ.46 లక్షలు వచ్చినా కొండపై కనీస సదుపాయాలు కల్పించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ కమిటీ ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు మరమ్మతులకు గురయ్యాయి. కొండపై అదనపు మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. మరో వైపు కొండ పైనున్న 106 ఎకరాల భూమిలో బీఎస్ఎన్ఎల్, సీడీసీఎంఎస్, స్కౌట్ అండ్ గైడ్స్, సిరికల్చర్ తదితర శాఖలకు కేటాయించిన స్థలాలు ఇష్టారాజ్యంగా లీజులు ఇవ్వడం, చేపట్టిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పోలీస్ ఔట్‌పోస్టు ఉన్నా.. రక్షణ కరువు

హార్సిలీహిల్స్‌కు సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తారు. వీరికి రక్షణ లేకపోవడం కూడా హిల్స్‌కు ఓ లోపంగా మారింది. పర్యాటకుల రక్షణ కోసం అంటూ గత ముఖ్యమంత్రి జగన్ 2023 ఏప్రిల్ 14న హిల్స్‌పై పోలీస్ ఔట్‌పోస్ట్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. అప్పటి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సైతం హాజరయ్యారు. ఆ స్టేషన్‌లో నిత్యం పోలీసులు అందుబాటులో ఉంటూ పర్యాటకులకు రక్షణ కల్పిస్తారన్నారు. అది కార్యరూపం దాల్చలేదు. ఆ పోలీస్‌స్టేషన్ అలంకార ప్రాయంగా మారింది. ఫిర్యాదు వస్తే వెళ్లడం తప్ప ఔట్‌పోస్ట్‌లో సిబ్బంది లేకపోవడంతో, కుటుంబాలతో వచ్చే పర్యాటకులకు ఆకతాయి యువకులు, మందుబాబుల నుంచి రక్షణ కరువైంది. అల్లర్లు షరా మామూలుగా మారాయి. శాశ్వత ప్రాతిపదికన సిబ్బందిని నియమించి పర్యాటకులలో భరోసా కల్పించాల్సి ఉంది.



అలంకారప్రాయంగా మారిన హిల్స్ పోలీస్‌స్టేషన్

అధ్యాపకుల సంఘం అధ్యక్షుడిగా రాఘవరెడ్డి

మదనపల్లె టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా మలిగి రాఘవరెడ్డిని ఎన్నుకున్నారు. ఆదివారం రాత్రి విజయవాడలో ఎస్ఆర్ఆర్, సీవీఆర్ కళాశాలల్లో నిర్వహించిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌సమావేశాల్లో మదనపల్లెకు చెందిన రాఘవరెడ్డి అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తోటి అధ్యాపకులు రాఘవరెడ్డిని అభినందించారు.

108 సిబ్బంది ఔదార్యం



కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కడప నగర పరిధిలోని అప్సర సర్కిల్ వద్ద గల విద్యుత్ కార్యాలయ గేటు వద్ద సోమవారం గుర్తు తెలియని మహిళ ప్రసవించింది. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. కాగా ఆమెకు సహాయకులు ఎవరూ లేరు. ఈ విషయమై స్థానికులు 108 సిబ్బందికి తెలుపగా వారు తక్షణం స్పందించి తల్లీబిడ్డను క్షేమంగా కడప రిమ్స్‌లో చేర్పించారు. 108 సిబ్బంది అయిన సీఎం బాషా, అబ్దుల్ రజాక్‌లను స్థానికులు అభినందించారు.

119 చౌక ధర దుకాణాలకు రీ నోటిఫికేషన్

మదనపల్లె టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని 119 చౌకధర దుకాణాల డీలర్ల నియామకానికి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ రీనోటిఫికేషన్ విడుదల చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు డివిజన్‌లో తాత్కాలిక డీలర్లు వున్న 74 చౌకధర దుకాణాకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో బి.కొత్త కోట మండలంలో 6, కలికిరిలో 10, కురబల కోటలో 5, మదనపల్లెలో 11, ములకలచెరువులో 3, నిమ్మనపల్లెలో 6, పెద్ద మండ్యంలో 2, పీటీఎంలో 3, రామ సముద్రంలో 3, తంబళ్లపల్లెలో 6, వాల్మీకిపురంలో 19 చౌక ధర దుకాణలతో పాటు, పునర్విభజన జరిగిన 45 చౌకధర దుకాణాలకు కొత్తగా డీలర్ల నియామకం చేపడుతున్నామన్నారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ బదులు కొత్త నోటిఫికేషన్ అమలులోకి వస్తుందన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 21 సాయంత్రం ఐదు గంటలలోపు ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28వ తేదీ రాత పరీక్ష వుంటుందని, 30,31 తేదీల్లో ఇంటర్వ్యూలు వుంటాయని సబ్‌కలెక్టర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

కురబలకోట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కనసానివారిపల్లె పంచాయతీ సిద్దారెడ్డిగారిపల్లెకు చెందిన సిబి.అశోక్‌కుమార్ (32) గత సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేశాడు. కాగా ఆ సమయంలో వైసీపీకి చెందిన పలువురు రకరకాలు బెదిరింపులకు పాల్పడంతో పాటుగా అతని భార్య చేత కేసు పెట్టించారు. అయినా ఏ మాత్రం అధైర్యపడకుండా ఎన్నికల్లో పోటీ చేశాడు. అనంతరం టీడీపీ రాజంపేట పార్లమెంటరీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా క్రియాశీలకంగా పని చేశాడు. ఈ నేపధ్యంలో ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రపోయాడు. ఉదయం ఎంతసేపటికి నిద్ర లేవకపోవడంతో అతని తల్లి వెళ్ళి నిద్రలేపగా మృతి చెందాడు. కాగా ఇతను ఒంటరితనం భరించలేక మృతి చెందాడా? లేక మరి ఏ ఇతర కారణంతో మృతి చెందాడో? తెలియడం లేదు. ఈ విషయం కుటుంబీకులకు తెలియడంతో అక్కడికి చేరుకుని బోరున విలపించారు.. కాగా పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ ఆసుపత్రికి వెళ్ళి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

అక్రమ కట్టడాల కూల్చివేత ప్రారంభం


మాండవ్యనది ఒడ్డున అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

రాయచోటిటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాండవ్య నది ఒడ్డున బఫర్ జోన్‌లో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాల కూల్చివేత పనులను సోమవారం అధికారులు ప్రారంభించారు. గాలివీడు రోడ్డులోని బ్రిడ్జికి సమీపంలో అశోక్‌రెడ్డి అనే వ్యక్తి మాండవ్య నదిని ఆక్రమించడంతో పాటు బఫర్ జోన్‌లో నిర్మించిన భవనాలను మున్సిపల్ సిబ్బంది కూల్చివేశారు. కమిషనర్ వాసుబాబు పనులను పర్యవేక్షించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా కట్టడాలు నిర్మిస్తే కూల్చివేస్తామని ఈ సందర్భంగా కమిషనర్ హెచ్చరించారు.

పోలీస్‌స్టేషన్‌లో పందెంకోళ్లు..!



ఈ చిత్రంలో కనిపిస్తున్నవి మామూలు కోళ్లు కాదు.. కత్తికట్టి బరిలోకి దించే పందెం కోళ్లు. ఇవన్నీ బరిలో కాలు దువ్వకుండా ఇలా మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్‌లో సీఐ గది ఎదుట ఇలా తీరుతూ కనిపించాయి. కారణం పోలీసులు వీటిని పట్టుకోవడమే.
మదనపల్లె మండలం, చీకలబైలు గ్రామం మేడిపల్లె సమీపంలో కోడిపందెం ఆడుతున్నట్టు పోలీసులుకు సమాచారం వచ్చింది. దీంతో సోమవారం ఆకస్మికంగా దాడి చేసి 17మందిని పందెంరాయుళ్లను అరెస్టు చేశారు. 12 కోళ్లను, రూ.21,900 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇలా స్వాధీనం తీసుకున్న పందెంకోళ్లను తీసుకొచ్చి స్టేషన్ పైభాగాన సీఐ గది ఎదుట కట్టేశారు.

- (మదనపల్లె అర్బన్-ఆంధ్రజ్యోతి)

అర్ధరాత్రి ఆకతాయిల వెకిలి చేష్టలు

- గురుకుల కళాశాల వద్ద ఘటన
- పోలీసుల దృష్టికి సమస్య


వాల్మీకిపురం మైనార్టీ గురుకుల పాఠశాల సమీపాన అసంపూర్తిగా ప్రహరీ నిర్మాణం

వాల్మీకిపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ సమీపాన తరిగొండ రోడ్డులో గల ఏపీ మైనార్టీ బాలికల జూనియర్ కళాశాల వద్ద ఆదివారం రాత్రి ఆకతాయిలు చేసిన వెకిలి చేష్టలు విద్యార్థినులను భయభ్రాంతులకు గురి చేసింది. వివరాలిలా.. స్థానిక బాలికల మైనార్టీ జూనియర్ కళాశాలలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని ఆకతాయి యువకులు మద్యం మత్తులో కళాశాల పక్క భాగంలోని ప్రహరీ ప్రాంతం నుంచి గోడ దూకి లోపలికి చొరబడి.. విద్యార్థినులను అసభ్య పదజాలంతో వేధించారు. దీంతో భయభ్రాంతులకు గురైన బాలికలు బిగ్గరగా కేకలు పెట్టడంతో కళాశాల మహిళా సిబ్బంది అప్రమత్తమయ్యారు. గమనించిన ఆకతాయి యువకులు కళాశాల ప్రాంగణం నుంచి పరారయ్యారు. సోమవారం ఉదయం కళాశాలలో ఈ విషయం చర్చనీయాంశంగా మారడంతో దావానంలా వ్యాపించింది. కళాశాల ప్రిన్సిపాల్ రమామంజుల జరిగిన సంఘటనను స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా మైనార్టీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల ఒకే ప్రాంగణంలో ఉండటంతో విద్యార్థినుల తల్లిదండ్రులు కూడా భయాందోళనలకు గురవుతున్నారు. పాఠశాలలో కానీ, బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఎక్కడా కూడా సీసీ కెమెరాలు లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు విద్యార్థినుల భద్రత విషయంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ విషయమై ప్రిన్సిపాల్ రమామంజుల మాట్లాడుతూ ఎలాంటి చిన్న సంఘటన కూడా కళాశాల ప్రాంగణంలో చోటు చేసుకోలేదని, ఆదివారం జరిగిన ఘటనపై పోలీసులకు తెలియజేశామన్నారు. ప్రహరీ నిర్మాణం విషయం స్థానిక మండల పరిషత్ అధికారులకు విన్నవించామని, కళాశాల ప్రాంగణంలో సీసీ కెమెరాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.



పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన స్థలానికి ఫెన్సింగ్

కురబలకోట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలో పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన స్థలం అన్యాక్రాంతానికి గురి కాకుండా పోలీసులు పటిష్టంగా ఫెన్సింగ్ వేశారు. మదనపల్లెలో రోడ్డులోని కుమ్మర ఫ్యాక్టరీ పక్కన సర్వేనంబర్ 363-1లో 96 సెంట్ల భూమి ఉంది. ఈ భూమిని అప్పట్లో టెర్రకోట కేంద్రానికి వారి నివాసాలకు రెవెన్యూ అధికారులు పట్టాలను మంజూరు చేశారు. అనంతరం పోలీస్టేషన్ నిర్మాణానికి 2019లో 10సెంట్ల స్థలాన్ని మంజూరు చేసింది. అయితే అప్పటి నుంచి ఈ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు. కాగా ఈ స్థలం పక్కనే కొంత జాగా ఖాళీగా ఉండటంతో అంగళ్ళుకు చెందిన డిష్ కుమారి గణపతి ఆలయంను మూడేళ్ల క్రితం నిర్మించింది. కాగా ఈ అలయానికి వెళ్లేందుకు మార్గ ముందు స్థలంలో రోడ్డు వేయడానికి ప్రయత్నించగా, అడ్డుకోవడానికి ప్రయత్నించిన హెడ్‌కానిస్టేబుల్ హరిపై దాడిచేశారనే అభియోగాలపై వైసీపీకి చెందిన సర్పంచ్ విశ్వనాథరెడ్డి, దామోదర్‌రెడ్డి, గుణకుంట వారిపల్లెకు చెందిన కృష్ణమూర్తి, శ్రీనివాసులు, శివరాంలపై కేసు నమోదు చేసి రిమండ్‌కు తరలించారు. కాగా రెవెన్యూ అధికారులు అక్కడికి ఆ స్థలానికి వెళ్లి సర్వే చేసి హద్దులు నిర్ణయించడంతో ఫెన్సింగ్ వేశారు.

ఈ ఇసుక డంపులు ఎవరివి?

- చెరువు చుట్టూ ఇసుక డంపులే
- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా


రామానాయుని చెరువు సమీపంలోని పొలాల్లో డంపు చేసిన ఇసుక

గుర్రంకొండ, డిసెంబరు 16: గుర్రంకొండ మండలంలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. ఇసుకాసురులు పగటి పూట చెరువులు, కుంటల్లో ఇసుకను తవ్వి ట్రాక్టర్లలో రైతుల పొలాల్లో డంపు చేస్తున్నారు. ఇలా పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ఇసుక డంపులుగా ఉంచుతున్నారు. ఈ ఇసుక డంపులను చీకటి పడగానే రాత్రి పూట ఎక్స్‌కవేటర్ల సాయంతో టిప్పర్లకు లోడ్ చేసి బయట రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇసుక డంపుల గురించి అధికారులకు ఎవరైనా రైతులు సమాచారమిస్తే వారిపై ఇసుకాసురులు దాడులకు పాల్పడుతున్నట్లు వాపోతున్నారు. అంతేకాకుండా చెరువులో ఇసుక మీ సొంత ఆస్తి కాదుగా అంటూ వారిని దుర్భాషలాడుతున్నారు. గుర్రంకొండ మండలంలో ఇసుక వ్యాపారం మూడు టిప్పర్లు ఆరు ట్రాక్టర్లు అనే విధంగా సాగుతోంది.

గుర్రంకొండ మండలంలోని పలు చెరువులను ఇసుకాసురులు చెరపట్టారు. ఇందులో భాగంగా రామానాయునిచెరువు, హరిహరాదులచెరువులో ఇసుకను తవ్వి బయటకు తరలిస్తున్నారు. ఈ చెరువుల్లో పగటి పూట ఇసుకను తవ్వి చుట్టూ ఉన్న రైతుల పొలాల్లో డంపు చేస్తున్నారు. రామానాయునిచెరువు చుట్టూ ఉన్న రుద్రవారిపల్లె, ఇరగన్నగారిపల్లె, రేగడపల్లె గ్రామాల్లోని రైతుల పొలాల్లో అక్కడక్కడ పది లోడ్ల ఇసుకను డంపు చేసి ఉంచారు. ఈ ఇసుక డంపులను రాత్రి పూట టిప్పర్‌లకు లోడ్ చేసి బయట ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. ఇసుక డంపుల గురించి పక్కపొలాల్లోని రైతులు అధికారులకు సమాచారమిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయంటూ వారిని ఇసుకాసురులు హెచ్చరిస్తున్నారు. దీంతో ఇసుక డంపుల గురించి చెప్పడానికి ప్రజలు, రైతులు ముందుకు రావడం లేదు.

ఇసుక డంపులుంటే సీజ్ చేస్తాం

అధికారుల అనుమతి లేకుండా ఇసుకను తరలించరాదు. ఇసుకను అక్రమంగా తరలించి నిల్వలు ఉంచరాదు. అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను గురించి సమాచారమిస్తే సీజ్ చేసి కేసు నమోదు చేస్తాం.

- మధురామచంద్రుడు, ఎస్ఐ, గుర్రంకొండ

అధికారులను కదిలించిన 'ఆటో గంగమ్మ'

చేయూతనిస్తామన్న ట్రైబల్ వెల్ఫేర్ కార్పొరేషన్



ఆటో గంగమ్మ వివరాలు తీసుకుంటున్న వెలుగు ఏపీఎం ఓబులేసు

కొండాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బతుకు భారమై.. ఆటో నడుపుతూ, ఆదర్శంగా నిలుస్తున్న ఆటో గంగమ్మ కథనం అధికారులను కదిలించింది. ట్రైబల్ వెల్ఫేర్ కార్పొరేషన్ నుంచి ఫోన్ చేసి ఆటో గంగమ్మ డేటా, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రుణం మంజూరు చేయించేందుకు సిద్ధమయ్యారు. వివరాల్లోకెళితే....

కొండాపురం మండలం గండ్లూరు ఎస్టీ కాలనీ వాసి గంగమ్మ కుటుంబం ఒక పూరి గుడిసెలో ఉంటోంది. గంగమ్మకు భర్త రవి, ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు, నలుగురు చెల్లెల్లు, ఒక తమ్ముడు, తల్లిదండ్రులు అరుణ, గంగన్న ఉన్నారు. వీరంతా గంగమ్మతోనే ఉంటున్నారు. భర్త రవి అనారోగ్యం కారణంగా ఇంట్లోనే ఉంటున్నాడు. గండికోట ముంపునకు గురైన గంగమ్మ ఇంటికి పరిహారం అందలేదు. ఆటో తెచ్చుకునేందుకు రుణం కావాలని, బ్యాంకుల చుట్టూ, అధికారులు చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా రుణం మంజూరు కాలేదు. బంధువుల నుంచి ఆటోను అద్దెకు తెచ్చుకుని ఆటో నడుపుతూ పెద్దకుటుంబాన్ని పోషిస్తోంది. దీంతో 'బతుకు భారమై.. ఆటో నడుపుతూ, ఆదర్శంగా నిలుస్తున్న ఆటో గంగమ్మ' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ట్రైబల్ వెల్ఫేర్ కార్పొరేషన్ గంగమ్మ వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీఆర్‌డీఏ జిల్లా అధికారుల ఆదేశాలతో వెలుగు ఏపీఎం ఓబులేసు సోమవారం సాయింత్రం గంగమ్మ ఇంటికి వచ్చి వివరాలు తీసుకున్నారు. గంగమ్మ డ్వాక్రా గ్రూపులో ఉన్నందున్న ఆమెకు రుణం ఇప్పించేందుకు తగిన వివరాలు తీసుకున్నట్లు ఏపీఎం తెలిపారు. తక్షణమే తనకు సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు గంగమ్మ తెలిపింది.

మూగజీవాలకు స్వేచ్ఛ

పశువుల నిర్బంధంపై తహసీల్దారు ఆగ్రహం ● యానిమల్ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరిక
గదికి అడ్డంగా పాతిన బండలు తొలగింపు ● బయటకు తరలించిన అధికారులు



ఎద్దును బయటికి తీసుకొస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): దాయాదుల మధ్య తలెత్తిన పంతాలు, పట్టింపుల మధ్య నలిగి ఐదు రోజులు నిర్బంధంలో ఉన్న మూగజీవాలు స్వేచ్ఛావాయువులు పీల్చుకున్నాయి. ప్రొద్దుటూరు తహసీల్దారు గంగయ్య, ప్రొద్దుటూరు రూరల్ ఎస్ఐ మహ్మద్‌రఫి నంగనూరుపల్లెకు చేరుకుని నిర్బంధంలో ఉన్న జీవాలను విడుదల చేశారు. దీంతో పశువులు బయటికి వచ్చి స్వేచ్ఛా గాలులు పీల్చుకున్నాయి. వివరాల్లోకెళితే....

ప్రొద్దుటూరు మండలం నంగనూరుపల్లె వాసి మేకల చెన్నమ్మ కుటుంబం వ్యవసాయం చేసి జీవించేది. మూడేళ్ల కిందట చెన్నమ్మ భర్త గంగయ్య మృతిచెందడంతో అప్పటి నుంచి కుమారుడు వరుసయ్యే శ్రీనివాసుల వద్ద చెన్నమ్మ ఉండేది. కాగా శ్రీనివాసులు అతని సోదరులు వెంకటసుబ్బయ్య, నాగార్జున మధ్య ఆస్తి భాగపరిష్కార విషయం, రస్తా వివాదంలోనూ మనస్పర్థలుండేవి. దీంతో శ్రీనివాసులుకు చెందిన పశువులు ఉంచే గది ముందు బండలు నాటారు. దాయాదుల పంతాలు, పట్టింపుల ముందు మూగజీవాల ఆవేదన ఓడిపోయింది. పశువుల కన్నీటి రోధన కాఠిన్య హృదయాలను కదిలించలేకపోయింది. మూడు రోజులు తిండి, నీరు లేక చీకటి గదిలో గడిపాయి. ఈవిషయంపై ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన 'మూగజీవాల నిర్బంధం' శీర్షిక అధికారులను కదిలించింది. సోమవారం మధ్యాహ్నం తహసీల్దారు గంగయ్య, ఎస్ఐ మహమ్మద్‌రఫి ఇన్‌చార్జి వీఆర్వో హర్ష, ఇన్‌చార్జి సచివాలయ కార్యదర్శి చండీశ్వరి, సర్వేయర్ సయ్యద్ మహ్మద్‌యూసూఫ్, తమ సిబ్బందితో కలిసి నంగనూరుపల్లెకు చేరుకున్నారు. ఘటనా స్థలిని పరిశీలించి మూగజీవాలపై పాల్పడిన దుశ్చర్యపై తహసీల్దారు ఆగ్రహిస్తూ పశువులను బంధించడం అమానుష చర్య అని హెచ్చరించారు. పాతిన బండలు తొలగించాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. రూరల్ ఎస్ఐ రఫి, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, కలిసి బండలను తొలగించగానే పశువులు బయటికి వచ్చి స్వేచ్ఛా గాలులు పీల్చుకున్నాయి. తహసీల్దారు ఇరువర్గాలను ఉద్దేశించి మాట్లాడుతూ ఇలాంటి చర్యలు పునరావృతమైతే అనిమల్ క్రూయల్టీ యాక్టు 1960 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటూ క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఆడ, మగ అనే తేడా ఉండదని చట్టం దృష్టిలో అంతా సమానమేనని హెచ్చరించారు. వివాదాస్పద స్థలాన్ని సర్వేయర్‌చే కొలతలు వేయించగా ఆ జాగాలో 105 లింకుల కాల్వ పొరంబోకు స్థలం ఉందని తేల్చారు. ఈ జాగా ఎవరి సొత్తు కాదని నిర్ధారించారు. గ్రామంలో వివాదాలు, జీవాల నిర్బంధంపై దారితీసిన వైనాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లని రెవెన్యూ సిబ్బందిపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. నంగనూరుపల్లెలో రెగ్యులర్ వీఆర్వో, కార్యదర్శులు లేరని, ఇన్‌చార్జి సిబ్బంది తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. రూరల్ ఎస్ఐ మాట్లాడుతూ 11వ తేదీన బండలు నాటిన సమయంలో చోటు చేసుకున్న సంఘటనలో మేకల శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితులైన నాగార్జున, వెంకటసుబ్బయ్య, వెంకటశివను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని, ఈ కేసులో మరోముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని వివరించారు.





గదికి అడ్డంగా నాటిన బండలు - తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఫ్లైయాష్ మీద పడి....

● ఆర్టీపీపీ కాంట్రాక్టు కార్మికుడు మృతి ● పరిహారం కోరుతూ మెయిన్ గేటు వద్ద ధర్నా

ఎర్రగుంట్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీలో 600 ప్లాంటు ఈఎస్‌పీ ఫ్లైయాష్ ఆపర్ వద్ద నాగార్జున కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు పగిడికాల్వ సందీప్ కుమార్(28) మృతి చెందాడు. వివరాల్లోకెళితే... మూడు వారాలుగా ప్లాంటు షట్‌డౌన్ పనులు చేస్తున్నారు. ఈఎస్‌పీ వద్ద గడ్డకట్టిన ఫ్లైయాష్ తొలగింపులో కదిరివారిపల్లె వాసి సందీప్ పనిచేస్తున్నాడు. ఒక్కసారిగా ఫ్లైయాష్ అతనిపై పడడంతో అందులో కూరుకుపోయి ఊపిరాడక మృతి చెందాడు. తోటి కార్మికులు అతన్ని వెలికి తీసి ప్రాజెక్టు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు.



మెయిన్ గేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీపీపీ కార్మిక సంఘం నేతలు (ఇన్‌సెట్‌లో) సందీప్ కుమార్ మృతదేహం

మృతిచెందిన కార్మికునికి పరిహారం విషయంలో కంపెనీ స్పందించకపోవడంతో కార్మిక సంఘాలు మృతదేహాన్ని ఫౌంటేన్ ప్రధానగేటు వద్ద ఉంచి ధర్నాకు దిగారు. సాయంత్రం వరకు చర్చలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, ఇతర కార్మిక సంఘనేతలు వారితో మాట్లాడారు. కంపెనీ నుంచి రూ.15లక్షలు నగదును ఇచ్చేందుకు ఒప్పించారు. కార్మికుని కుటుంబానికి జీఓ నెంబరు 129ప్రకారం ఆర్టీపీపీలో మెంటెనెన్స్‌లో ఉద్యోగం ఇచ్చేందుకు సీఈ కూడా అంగీకరించినట్లు కార్మిక వర్గాలు తెలిపాయి. దీంతో బాధితులు ధర్నా విరమించారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పరీక్ష నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇటీవల ఇలాంటి ప్రమాదాలు తరచూ జరగడంతో కాంట్రాక్టు కార్మికులకు భద్రత కరవైందని, యాజమాన్యాలు కనీస భద్రత కల్పించడం లేదని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ఇకపై ఇలాంటివి పునరావృతం కాకుండా కార్మికుల జీవితాలకు గట్టి భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

కార్యదర్శులపై డీఎల్‌పీఓ విచారణ

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోపవరం పంచాయతీ పరిధిలో గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు గురుమోహన్, రామమోహన్‌పై డీఎల్‌పీఓ తిమ్మక్క విచారణ చేపట్టారు. పంచాయతీ పరిధిలో అవినీతి జరిగిందని సమాచార హక్కు ద్వారా మార్తల వెంకటసుబ్బారెడ్డి జడ్పీసీఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం డీఎల్‌పీఓ గోపవరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి అప్పట్లో విధులు నిర్వహించిన కార్యదర్శులు గురుమోహన్, రామమోహన్ సంజాయిషీ నమోదు చేసుకున్నారు. గతంలో వీరు లేఅవుట్ల విషయంలో బిల్డింగ్ అప్రూవల్, ఇంటి పన్నుల వసూళ్ల తదితర అంశాల్లో రెండు మూడేసి రశీదులు జారీ చేసి అవినీతికి పాల్పడ్డారని ఫిర్యాదుపై ఆమె విచారణ నిర్వహించారు. ఫిర్యాది వద్ద ఉన్న ఆధారాలు అందిస్తే నోటీసులు జారీ చేసి విచారణ జరుపుతామని డీఎల్‌పీఓ కోరగా త్వరలో అందజేస్తానని వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. కార్యదర్శుల సంజాయిషీ తీసుకుని జడ్పీసీఈఓకు నివేదిక పంపనున్నట్లు తిమ్మక్క వివరించారు.

కబడ్డీ ఎంపికలకు అనూహ్య స్పందన



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ డిసెంబరు 16, (ఆంధ్రజ్యోతి): జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి కడప జిల్లా జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ ఎంపికలకు ఔత్సాహిక క్రీడాకారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి సుమారు వంద మంది క్రీడాకారులు హాజరయ్యారు. డీఎస్‌డీఓ జగన్నాథరెడ్డి, ఏపీ పీఈటీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ (అన్నమయ్య జిల్లా) వీరాంజనేయులు క్రీడకారులను పరిచయం చేసుకున్నారు. తదనంతరం పోటీలు నిర్వహించారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22 నుంచి 25 వరకూ ఈస్ట్ గోదావరి జిల్లా రావులపాలెంలో జరుగనున్న అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొనాల్సివుంటుందని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకటసుబ్బన్న వెల్లడించారు. కార్యక్రమంలో డీఎస్ఏ కబడ్డీ కోచ్ ఆర్‌వీ శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జె. సుబ్బన్న, ట్రెజరర్ కొండయ్య జోనర్ పాల్గొన్నారు.

తైక్వాండోతో విద్యార్థినుల్లో మానసిక ధైర్యం : వీసీ



విద్యార్థినులకు సూచనలు చేస్తున్న వీసీ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో ఆత్మవిశ్వాసం పెంచి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది, ధైర్యంగా ముందుకెళ్లగలిగేలా తయారుచేస్తుందని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఫిట్ ఇండియా వారోత్సవాల్లో భాగంగా వైవీయూ వసతి గృహాల విద్యార్థినులకు క్యాంపస్‌లో తైక్వాండో శిక్షణ తరగతులను పీజీ కళాశాల ప్రధానాచార్యులు, హాస్టల్ చీఫ్ వార్డన్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ తో కలిసి ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ తైక్వాండో మానసిక క్రమశిక్షణ మాత్రమే కాక క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తుందన్నారు. భయం మనిషిని అచేతనంగా చేస్తుందని, ధైర్యం అనంత శక్తిని ఇస్తుందని ఉద్బోధించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, వసతి గృహ సంక్షేమ అధికారి డాక్టర్ సునీత, విద్యార్థినులు పాల్గొన్నారు.

10 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత - ఇద్దరు అరెస్ట్

రాజంపేట టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం కడప - చెన్నై హైవేలో మినీ లారీలో తీసుకెళుతున్న 10 టన్నుల రేషన్ బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు మన్నూరు సీఐ మహ్మద్‌అలీ తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టాటా మినీ వాహనంలో చౌక బియ్యం అక్రమ రవాణా చేస్తుండగా పట్టుకున్నామన్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణం మాసాపేట వాసి కంపా అంకయ్య, అనంతపురం జిల్లా గుంతకల్ పట్టణం బుచ్చిరోడ్డుకు చెందిన ఎరుకుల వెంకటరాఘవయ్య 150 బస్తాలతో 10 టన్నుల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశామన్నారు. వాహనాన్ని, బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించామని సీఐ తెలిపారు.

పురాతన కత్తెరగండ్ల శివాలయం తొలగింపు





శిథిలావస్థకు చేరిన శివాలయం - యంత్రాలతో తవ్వి శిథిలాలను తొలగిస్తున్న దృశ్యం

కాశినాయన డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా శిథిలావస్థకు చేరిన చెన్నవరం సమీపంలోని అతిపురాతనమైన ఇష్టకామేశ్వరి దేవి సమేత సాంబశివస్వామి ఆలయాన్ని(కత్తెరగండ్ల శివాలయాన్ని) సోమవారం అధికారుల సమక్షంలో నిర్వాహకులు తొలగించారు. ఇందుకోసం 3 రోజులుగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సోమవారం పోలీసు, రెవెన్యూ అధికారుల సమక్షంలో శివాలయంలోని విగ్రహాలను బాలాలయంలోకి మార్చారు. అనంతరం గుడిని యంత్రాలతో తవ్వి శిథిలాలను తొలగించారు. ఈగుడిని పాండవుల మునిమనవడు జనమేజయ మహారాజు ప్రతిష్ఠించినట్లు స్థానికులు తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

సిద్దవటం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): టక్కోలి అరుంధతివాడలో ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలియజేశారు. ఏఎస్ఐ సుబ్బరామ చంద్ర మాట్లాడుతూ ఆదివారం రాత్రి అరుంధతీ వాడలో జేమ్స్‌బాబు, వంశీబాబు, జయరాజ్ మల్లికార్జున అతని తల్లిదండ్రులపై దాడి చేశారు. మల్లికార్జునకు బలమైన గాయమవడంతో కడప రిమ్స్‌కు తరలించామన్నారు. బాధితుడి అన్న నేలటూరి ఈశ్వరయ్య ఫిర్యాదుపై నలుగురిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో చిన్నకు స్వర్ణ పతకం



దువ్వూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో శని, ఆదివారాల్లో జరిగిన యోగివేమన యూనివర్శిటీ పరిధి పోటీల్లో డి.చిన్న స్వర్ణపతకం సాధించారు. ప్రొద్దుటూరు వాసి చిన్న పుల్లారెడ్డి పేటలోని డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్నారు. ఇతడు యూనివర్సిటీ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించారు. ఇదే విద్యార్థి బెస్ట్ ఫిజిక్ పోటీల్లో రెండో స్థానంలో నిలిచి వెండి పతకం గెలుపొందాడు. ఇదే కాలేజీకి చెందిన విద్యార్థులు కబడ్డీ పోటీల్లో 3వ స్థానంలో నిలిచారు. వీరికి సర్టిఫికెట్లు, మెమెంటోలను అందజేశారు. సోమవారం విజేతలను కాలేజీ కరస్పాండెంట్ ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, వ్యాయామ అధ్యాపకుడు కన్నయ్య అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



నాగయ్య మృతదేహం

రామాపురం, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలగిరి నాగయ్య (71) మృతి చెందగా గూడూరు బాషాకు తీవ్రగాయాలైనట్లు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. రాయచోటి పట్టణం మాసాపేట వాసులు పాలగిరి నాగయ్య, గూడురు బాషా ఆదివారం కడపలో జరిగిన ఇష్టిమాకు వెళ్లి తిరిగి ఇంటికి మోపెడ్‌లో బయలుదేరారు. వీరి వాహనం కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై రామాపురం మండలం బండపల్లి పంచాయతీ పరిధి ఆటోనగర్ వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పాలగిరి నాగయ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివా రం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మధ్యవర్తిత్వమే పరిష్కార మార్గం

కడప రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం చక్కటి ప్రక్రియ అని మొదటి అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో సోమవారం మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు శిక్షణలో ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు ఖర్చు, సమయం ఆదా అవుతాయన్నారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో రాజీ మార్గమే రాజమార్గమన్నారు. ఖర్చు లేకుండా కక్షిదారులకు సత్వర న్యాయసేవలందించే లక్ష్యంతో సుప్రీంకోర్టు 1987లో న్యాయసేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించిందన్నారు. తద్వారా వ్యక్తుల మధ్య తగాదాలను రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తారన్నారు.

'బాధితులకు న్యాయం చేయండి'

కడప(క్రైం)డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు వచ్చే వారి సమస్యలను తెలుసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఏఎస్పీ(పరిపాలన) ప్రకాష్‌బాబు సిబ్బందిని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యలు అడిగితెలుసుకుని సంబంధిత పోలీసు స్టేషన్‌లకు బదిలీ చేశారు.

ఆరు ఎర్రచందనం దుంగల స్వాధీనం

రాజంపేట టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చెయ్యేరు నదీ ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్న ఒకరిని సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీలు జి.బాలిరెడ్డి, వి.శ్రీనివాసరెడ్డి మార్గనిర్దేశకత్వంలో కడప సబ్ కంట్రోల్ సానిపాయ బేస్ ఆర్ఐ చిరంజీవులకు చెందిన ఆర్ఎస్ఐ వై.విశ్వనాథ్ టీమ్ ఆదివారం నుంచి జాండ్రపెంట ఎఫ్‌బీవోతో కలిసి గుర్రపుబాట తూర్పు వైపున గల చెయ్యేరువైపు కూంబింగ్ చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున వీరు మేకలకోన వద్దకు చేరుకోగా అక్కడ కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. వీరు పోలీసులను చూసి పారిపోగా ఒకరిని పట్టుబడ్డారు. అక్కడున్న ఆరు దుంగలను స్వాధీనం చేసుకుని నిందితుడిని తిరుపతికి తరలించారు.

కాల్వలో యూసీఐఎల్ ఉద్యోగి మృతదేహం



రామాంజనేయులు మృతదేహం

పులివెందుల టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): యూరేనియంలో ఏఎండి ఆపరేటర్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రామాంజనేయులు (28) మృతదేహం కాల్వలో లభ్యమైంది. ఆదివారం సాయంత్రం నల్లపురెడ్డి పల్లె దారిలో ఉన్న కాల్వ గట్టున బైక్ గమనించిన స్థానికులు సమాచారంపై పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కాల్వలో గాలించారు. సోమవారం మృతదేహాన్ని బయటికి తీసి, ప్రభుత్వాస్పత్రికి తరలించి శవ పరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించామని పట్టణ సీఐ నరసింహులు తెలిపారు. మృతుని స్వగ్రామం వేమల మండలం, మబ్బు చింతలపల్లి కాగా ప్రస్తుతం ఎర్రగుడిపల్లెలో ఉంటున్నారు. మృతుడు ఆదివారం పూజలు చేయించుకుని పూజా సామగ్రిని కాల్వలో కలపడానికి వెళ్లి ప్రమాదవశాత్తు పడ్డాడని, ఈత రాక మునిగిపోయినట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందని సీఐ తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. వివరాలు పూర్తి విచారణ తర్వాత వెల్లడిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మైలవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు-తాడిపత్రి ప్రధాన రహదారిలో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతున్న మద్దిరాల సుధాకర్ (48)ను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందినట్లు తలమంచిపట్నం ఎస్ఐ లక్ష్మినారాయణ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు దన్నవాడ వాసులు సుధాకర్, కుమారుడు యేసుదాసు ఇద్దరూ రోడ్డుకు ఓ పక్కన ముందు వెనుకగా నడుచుకుంటూ వెళుతున్నారు. జమ్మలమడుగు నుంచి రామ్‌కో సిమెంటు పరిశ్రమకు వెళుతున్న లారీ వెనుక వైపు నుంచి సుధాకర్‌ను ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందగా లారీ మరికొంచెం ముందుకెళ్లి ద్విచక్ర వాహనాన్ని సైతం ఢీకొట్టి లారీ సహా డ్రైవర్ పరారీ అయ్యారు. స్పందించిన పోలీసులు లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడు సుధాకర్ కూలి పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్వగ్రామానికి బాధితురాలు

మదనపల్లె టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే షాజహాన్ బాషా, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రాటకొండ మధుబాబు చొరవతో తాను స్వగ్రామానికి చేరుకున్నానని కువైత్ బాధితురాలు పార్వతమ్మ వివరించారు. సోమవారం ఎమ్మెల్యే నివాసానికి భర్త శంకర్‌నాయక్‌తో కలిసి వచ్చిన ఆమె మాట్లాడుతూ తంబళ్లపల్లె మండలం పెద్దమండ్యం మండలం వడ్డివంక తండాఅని, కుటుంబం గడవకపోవడంతో రెండేళ్ల కిందట అప్పు చేసి కువైత్ వెళ్లానని పార్వతమ్మ చెప్పింది. అక్కడ సేఠ్‌లు తనను అరెస్టు చేయించి మానసిక క్షోభకు గురిచేశారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన కువైత్ ఎంబసీ అధికారులతో చర్చించారని, అలాగే మధుబాబుకు తెలిసిన కువైత్ అధికారితో ఫోన్‌లో మాట్లాడి తనను స్వదేశానికి వచ్చేందుకు వీలుకల్పించారన్నారు. తమ కుటుంబాన్ని కాపాడిన ఎమ్మెల్యే, మధుబాబుకు పార్వతమ్మ, శంకర్‌నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

డ్రోన్ల వినియోగంతో అధిక దిగుబడులు



డ్రోన్ టెక్నాలజీపై వివరిస్తున్న ముంబై యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రకాశ్

సికెదిన్నె, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ముంబై డీమ్డ్ యూనివర్సిటీ సీఎస్ఈ డిపార్టుమెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.ప్రకాశ్ తెలిపారు. 'డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయ నిర్వహణ' అనే అంశంపై స్థానిక కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ డిపార్టుమెంట్‌వారు నిర్వహించిన వర్క్‌షాపునకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వ్యవసాయ నిర్వహణ, ఆధునిక కాలంలో అధిక ఉత్పత్తి, రైతు ఆదాయం రెట్టింపు చేయడం అనే అంశాలపై విద్యార్థులకు వివరించారు.మరొక అతిథి ముంబై యూనివర్సిటీకి చెందిన విశిష్ట ఎడ్యుకేటర్ ఉజ్వల మాట్లాడుతూ డ్రోన్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆధారిత వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై రైతులు తమ పంటల పరిస్థితిని సకాలంలో తెలుసుకోవడంతో వ్యవసాయ రంగంలో మార్పు సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి, ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి, వైస్‌ప్రిన్సిపాల్ టి.ఎస్.ప్రసాద్, ప్రోగ్రాం కన్వీనర్, హెచ్‌వోడీ విజయకిశోర్, అరుణ్‌కుమార్, ప్రభాకర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సంఘాల సభ్యులకు ఉపాధే లక్ష్యం

వేముల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలలో సభ్యులకు జీవనోపాధి పెంపొందించడమే లక్ష్యమని వెలుగు ఏపీఎం అంజనేయులు తెలిపారు. సోమవారం మండలంలోని చాగలేరు గ్రామంలో స్వయం సహాయ క సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేసేందుకు ప్రత్యేక సమావేశాలు సమావేశాలు గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు శ్రీలక్ష్మి అ ధ్యక్షతన నిర్వహించారు.

ప్రారంభమైన ధనుర్మాస పూజలు

వేంపల్లె, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస పూజలు ప్రారంభమైనట్లు ఆలయ ఈఓ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. వేంపల్లెలోని శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వరస్వామి దేవస్థానం అనుసంధానంలో గల శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా సోమవారం శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వరుడు రాజమన్నార్‌స్వామి అలంకరణలో దర్శనమిచ్చారు.

వైసీపీ భూ అక్రమాలను వెలికి తీస్తాం

● కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి



అర్జీలను స్వీకరిస్తున్న కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

వీరపునాయునిపల్లె, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో చేసిన అవినీతి అక్రమాలను చిత్తశుద్ధితో పనిచేసి వెలికి తీస్తామని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొమ్మద్ది గ్రామంలో ఎమ్మెల్యే అధ్యక్షతన రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదర్భంగా ఆయన రైతులను ఉద్దేశంచి మాట్లాడారు. వైసీపీ నాయకులు ఎస్సీ భూములను ఆన్‌లైన్‌లో నుంచి తొలగించి రిజర్వాయర్‌లోకి పోయాయని అబద్ధాలు చెప్పి భూములు ఆక్రమంచుకున్నారన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని భూకబ్జాలు, ఎస్సీ భూముల్లో చేపల చెరువులను పెట్టుకున్నారన్నారు. గత ఐదేళ్ల కాలంలో అనుభవించిన కష్టాల నుంచి బయటపడతామన్న నమ్మకంతో ప్రజలు ఉన్నారన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను 40 శాతం అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. పేదలకు భూములు ఇప్పించి భూ సమస్యలను పరిష్కరించడమే తమ ప్రభు త్వం లక్ష్యంగా పెట్టుకుదన్నారు. టీడీపీ మండల కన్వీనర్ విజయభాస్కర్‌రెడ్డి, కార్యదర్శి గండి ఓబయ్య, తహసీల్దార్ లక్ష్మీదేవి, ఎంపీడీఓ చంద్రమౌళీ స్వరుడు, మాజీ ఎంపీటీసీ సూరారెడ్డి, ఎస్ఐ మంజునాథ్ పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

పెండ్లిమర్రి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు స్వయంగా తెలుసుకొని అధికారుల సమక్షంలో పరిష్కారం కోసమే ప్ర భుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే పుత్తా క్రి ష్ణచైతన్యరెడ్డి అన్నారు. తుమ్మలూరు గ్రామంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. సమస్యలు 40 రోజులలో పరిష్కారం అయ్యే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. దీర్ఘకాలంగా ఉన్న రైతు సమస్యలకు పరిష్కారం చూపడానికి ఈ రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ సురేంద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి, టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, ఆరవేటి చంద్రారెడ్డి, కేపీ నర్సింహారెడ్డి, రామసుబబ్బారెడ్డి, ఇతర నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక దిగుబడిపై రైతులకు అవగాహన

వల్లూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఏఓ సాయిజ్యోతి అన్నారు. సోమవారం దిగువపల్లెలో రైతు సద స్సు, విద్యార్థులచే వ్యవసాయ ప్రదర్శన చేపట్టారు. ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ అంకయ్యకుమార్ మాట్లడారు.



రూ. కోటి పరిహారం ఇవ్వాలి

కడప సెవెన్ రోడ్స్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్‌లో చనిపోయిన సందీప్ కుటుంబానికి రూ.కోటి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాగా విశాఖపట్నం, అనకాపల్లె, విజయనగరం కార్మాగారాలలో చనిపోయిన కుటుంబాలకు రూ.కోటి ఇచ్చారన్నారు.

రాష్ట్ర స్థాయి భగవద్గీత పోటీలలో
'బాలవికాస్'కు ప్రథమ బహుమతి



విద్యార్థులను అభినందిస్తున్న బాలవికాస్ యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీలలితా పంచాయతన ఆలయంలో చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి భగవద్గీత పఠన పోటీలలో బాలవికాస్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని 59 జిల్లాల నుం చి విద్యార్థులు పాల్గొనగా అందులో కడప బాలవికాస్ పాఠశాల విద్యార్థులు డిగ్రూప్ నుంచి 5వ తరగతి విద్యార్థి సుభాష్ ప్రతిమన్, 10వ తరగతి విద్యార్థి టి.ప్రదీప్‌కుమార్‌లకు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు పాఠశాల డైరెక్టర్ గంగయ్య తెలిపారు. బహుమతులతో పాటు సర్టిఫికేట్, మెమెంటో, రూ.10వేలు నగదు అందుకున్నారు. ప్రథమ బహుమతి గెలుచుకున్న విద్యార్థులను పాఠశాల యాజమాన్యం తరపున కరస్పాండెంట్ సుబ్బరాయుడు, డైరెక్టర్ గంగయ్య, శ్రీలక్ష్మి అభినందిస్తూ ప్రోత్సహిస్తూ ఒక్కొక్కరికి రూ.2వేలు నగదు అందించారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

వక్ఫ్‌బోర్డ్ ఆస్తుల పరిరక్షణకు తోడ్పడాలి



మాట్లాడుతున్న రెహమాన్ సాహెబ్

కడప మారుతీనగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డ్ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వాలు తోడ్పాటు అందించాలని ఆలిండియా పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు మౌలానా ఖాలీద్ సైఫుల్లా రెహమాని సాహెబ్ కోరారు. సోమవారం మస్తాన్‌వలీ వీధిలో గల జామియా తుస్సాలిహాత్ మద్రసాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ బాధ్యతను కేంద్రంలోని బీజేపీ సర్కార్ తీసుకోవాలన్నారు. కేంద్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. దీంతో దేశంలోగల వక్ఫ్ ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వక్ఫ్ ఆస్తులైన మసీదులు, శ్మశాన వాటికలు ఆక్రమణకు గురయ్యాయన్నారు. బోర్డుకు సంబంధించిన ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు కేంద్రం చట్టసవరణలు చేయడం సరికాదన్నారు. దీంతో భూములు అన్యాక్రాంతం అయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. కావున పాలక ప్రభుత్వాలు పెద్ద మనసుతో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు తోడ్పడాలన్నారు. నగర ముస్లిం నాయకులు అఫర్‌ఖాన్, సయ్యద్ అహ్మద్ పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి నిరంతరం పాటుపడతాం

చెన్నూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేసీ ఆయకట్టు కింద ఉన్న రైతుల అభ్యున్నతికి నిరంతరం పాటుపడతామని చెన్నూరు, చిన్నమాసుపల్లి, ఆలంఖాన్‌పల్లె, నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి అన్నారు. సోమవారం చెన్నూరులో ఎన్నికైన అధ్యక్షులకు రైతులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము రైతులమేనని, రైతుల క ష్టాలు తెలుసన్నారు.

ప్రజలపై విద్యుత్ భారం తగ్గించాలి: సీపీఐ

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై విద్యుత్ భారాలను తగ్గించాలని సీపీఎం నగర అధ్యక్షుడు రామమోహన్ డిమాండ్ చేశారు. సోమవారం కడప ఆ ర్టీసీ బస్టాండ్ వద్దనున్న అం బేడ్కర్ సర్కిల్‌లో సీపీఎం కడప నగర కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల భారంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగంలో కీలకమార్పులు తెచ్చి ప్రజలపై భారం మోపుతున్నారన్నారు.

మధుర జ్ఞాపకాలతో పూర్వ విద్యార్థుల కలయిక



2003-04 పూర్వ విద్యార్థులతో సంగమేశ్వర విద్యాసంస్థల అధినేత వివి సుబ్బానాయుడు

వీరపునాయునిపల్లె, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల కలయిక మధుర జ్ఞాపకాలతో ఆనందపరవశం నింపిందని సంగమేశ్వర విద్యాసంస్థల అధినేత వివి సుబ్బానాయుడు అన్నారు. సంగమేశ్వర ఉన్నత పాఠశాలలో 2003-2004లో పదవ తరగతిలో చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన సభ జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ బాగోగులను తెలుసుకున్నారు. చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఉబ్బితబ్బిబ్బయ్యారు. విందు భోజనాలు ఆరగించారు. ఉపాధ్యాయులను సత్కరించారు. సంగమేశ్వర ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుభాషిణి, ఉపాధ్యాయులు రమేష్, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్న పూర్వ విద్యార్థులు



వేంపల్లె చైతన్య హైస్కూల్లో కలిసిన 2012-13లో చదివిన విద్యార్థులు

వేంపల్లె, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వారందరు ఆ పాఠశాలలో పదవ తరగతి వరకు చదివారు. వారంతా 12 సంవత్సరాల తర్వాత ఆ పాఠశాలలో కలిశారు. పాతజ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకొని సంబరపడ్డారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలుకరించి ఆనందించారు. వేంపల్లె శ్రీచైతన్య హైస్కూల్లో 2012-13లో పదోతరగతి చదివిన విద్యార్థులు సోమవారం సమావేశమయ్యారు. అప్పటి గురువులను సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్నేహితులందరు కలిసి ఒకరి పరిస్థితిని ఒకరు అడిగి తెలుసుకొని ఉత్సాహంగా గడిపారు. చైతన్య హైస్కూల్ కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ ఉన్నత స్థానాల్లో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నాణ్యతలో రాజీపడొద్దు: కమిషనర్



పబ్లిక్ అండ్ హెల్త్ ఎస్ఈ చెన్నకేశవరెడ్డితో మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అండర్‌గ్రౌండ్ డ్రానేజీకి సంబంధించి ఎస్టీపీ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఏమాత్రం రాజీపడొద్దని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మనోజ్ రెడ్డి పబ్లిక్ అండ్ హెల్త్ అధికారులను ఆదేశించారు. పనులు త్వరతగతిన పూర్తిచేయాలని ఆయన సూచించారు. సోమవారం పబ్లిక్ అండ్ హెల్త్ ఎస్ఈ చెన్నకేశవరెడ్డితో కలిసి ఎస్టీపీ పనులను పరిశీలించారు. ముందుగా యూజీడీ పైప్‌లైన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ అండ్ హెల్త్, అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు తక్షణం చెల్లించాలి



కడప కార్పొరేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

కడప నాగరాజుపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూ డు నెలల వేతనాలను తక్షణం చెల్లించాలని మున్సిపల్ యూనియన్ సీఐటీయూ అనుబంధం కడప నగర కమిటీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరామ్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట డ్రైవర్ల కమిటీ కార్యదర్శి సుంకర కిరణ్ అధ్యక్షతన నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ పండుగపూట వారిని పస్తులు పెట్టవద్దన్నారు. మున్సిపల్ యూనియన్ నగర సహాయ కార్యదర్శి ప్రకాష్ మాట్లాడుతూ అడిషనల్, కోయిడు కార్మికులకు ఎస్ఐపీఎఫ్ కల్పించాలని, ఈఎస్ఐ పీఎఫ్‌లో కార్మికులకు అనేక బెనిఫిట్స్ ఉన్నాయన్నారు. డిమాండ్లు పరిష్కరించిన నేపథ్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మస్తాన్, ఆశాబాబు, కార్మికులు పాల్గొన్నారు.

'రైతు సంక్షేమమే టీడీపీ ధ్యేయం'

వేంపల్లె, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జయరామిరెడ్డి తెలిపారు. బీటెక్ రవి సారథ్యంలో అన్ని స్థానాలను కైవసం చేసుకున్నామని, రాబోవు రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలను కూడా కైవశం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతుల కోసం పార్టీనిబద్ధతతో పనిచేస్తుందన్నారు. పాములూరు చంటి,వార్డు సభ్యులు వెంకటేశ్, శివకృష్ణారెడ్డి, ఆదిత్యరెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

కడప నాగరాజుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శిక్షణను సద్వినియోగం చేసుకొని విధి నిర్వహణలో ఎదురయ్యే విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని కడప ఎంఆర్‌టీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఏపీఎస్పీడీసీఎల్ విద్యుత్ భవన్‌లోని శిక్షణ కేంద్రంలో భారత ప్రభుత్వ అధికార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ వారు కార్యచరణ, భద్రత, విపత్తు నిర్వహణపై శిక్షణ నిర్వహించారు.





స్వచ్ఛ బద్వేలుకు అందరూ సహకరించండి



మొక్కలను అందిస్తున్న నరసింహారెడ్డి

బద్వేలుటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలో మొక్కలు నాటేందుకు వీలున్న ప్రతి ఒక్కరూ నాటి స్వచ్ఛ బద్వేలుకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సీఓలు, ఆర్‌పీలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి పూసలవాడ కాలనీలోని సచివాలయం పరిధిలో ఆ కాలనీవాసులకు మొక్కల ప్రాముఖ్యతపై వివరించారు. అటవీశాఖ అధికారుల సహకారంతో మొక్కలు సరఫరా చేయడానికి మున్సిపల్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది పూర్తిసహకారం అందిస్తారన్నారు.

19 నుంచి పాలిటెక్నిక్ బాలుర క్రీడాపోటీలు

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొర్రపాడు రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు కడప రీజినల్‌స్థాయి 27వ ఇంటర్ పాలిటెక్నిక్ బాలుర క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జింకా అశోక్‌బాబు తెలిపారు. సోమవారం క్రీడా పోటీల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు చెస్, వాలీబాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, బాల్‌బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లో 100, 200, 400, 800, 1500, 100 ఇన్‌టు 4 మీటర్లు రిలే పరుగు పందెం, హైజంప్, లాంగ్‌జంప్, బ్రాడ్‌జంప్, ట్రిపుల్‌జంప్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు.

ఏదీ...స్వచ్ఛత..?

- పారిశుధ్య పనుల్లో ప్రక్షాళన ఎన్నడు
- కంపాక్టర్ బిన్స్ లేక ఇబ్బందులు
- లారీలకు లిఫ్టింగ్ చేయడంలో అగచాట్లు



మున్సిపల్ కార్యాలయంలో పాడై పోయిన కంపాక్టర్ బిన్స్



పాడైపోయిన వీల్‌బార్స్, పుష్‌కార్టులు

ప్రొద్దుటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలో పట్టణ ప్రజలు ఆరోగ్యంగా వుండాలంటే అక్కడ మెరుగైన పారిశుధ్య నిర్వహణ వుండాలి. మున్సిపాలిటీల ప్రధాన విధుల్లో పారిశుధ్య నిర్వహణే కీలకమైంది. కానీ మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన నిధులు సకాలంలో కేటాయించి పట్టణంలో పరిశుభ్రతను పెంచి ప్రజా ఆరోగ్యాలను పరిరక్షించడంలో పాలక మండలి అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంటారు. పారిశుధ్య నిర్వహణలో వుండే కార్మికులకు కనీసం చీపుర్లు,దోట్లు పారలు, తోపుడు బండ్లు ప్లాస్టిక్ బిన్స్ లాంటి పనిముట్లు సకాలంలో అందని పరిస్థితి మున్సిపాలిటీల్లో వుంది. దీంతో కార్మికులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతూనే పారిశుధ్య పనులు చేపడుతున్నారు. లక్షల జనాభా వుండే పట్టణాల్లో ఈ దుస్థితి కొనసాగటం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

పారిశుధ్యపనుల్లో ప్రక్షాళన ఎన్నడు..?

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో పారిశుధ్య పనులు అధ్వానంగా సాగేవి. కార్మికులు తమకు ఏ పనిముట్లు కావాలని గట్టిగా పాలక మండలిని, అధికారులను ప్రశ్నించలేని పరిస్థితి వుండేది. వైసీపీ ప్రభుత్వంలో ఇంటింటి కసువు సేకరణకు క్లాప్ ఆటోలు ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణకు నెలకు ఒక్కొక్క ఆటోకు 65 వేలు ఖర్చు అయ్యేది. దాదాపు 41 వార్డులకు 35 ఆటోలతో ఇంటింటి కసువు సేకరణ చేపట్టి చెత్తపన్ను వసూ లు చేసి ఆపన్ను వీటికి వెచ్చించాలని నిర్ణయించారు.కానీ అవి ఏడాది కాలానికే వాటిని మున్సిపాలిటీలు భరించలేని పరిస్థితి ఏర్పడింది. క్లాప్ ఆటోలకు చెల్లించవలసిన డబ్బు మున్సిపాలిటీలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో క్లాప్ డ్రైవర్లకు జీతాలు కూడా అందించలేక క్లాప్ వాహనాలు మూల న పడ్డాయి. చెత్త పన్నులు సరిగా వసూలు కాకపోక ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. అయితే క్లాప్ ఆటోలు వున్నప్పుడు తడి, పొడి చెత్త అందజేయడానికి ప్రతి ఇంటికి రెండు ప్లాస్టిక్ బిన్స్ మున్సిపాలిటీ కొనుగోలు చేసి అందజేశారు. అవి అతి కొద్దికాలానికే పాడ యిపోయాయి. వాటి నాణ్యతపై అప్పట్లో విమర్శలు వచ్చాయి. ఏడాది కూడా రాకుండానే అవి పాడయి పోతే మళ్ళీ మున్సిపాలిటీ వాటిని అందించలేదు. అయితే వీధుల్లో వుండే చెత్తపాయింట్లకు కంపాక్టర్ బిన్స్ గత టీడీపీ ప్రభుత్వంలో ఆసం రఘురామిరెడ్డి చైర్మన్‌గా వున్నప్పుడు కొనుగోలు చేశారు. వాటి తరువాత మళ్ళీ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో కంపాక్టర్ బిన్స్‌ను కొనుగోలు చేయలేదు. దీంతో కంపాక్టర్‌లలోకి చెత్తను వేసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు నెల కొన్నాయి. కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైసీపీ హయంలో సచివాలయాల వ్యవస్థ ఏర్పడి ప్రతి వార్డుకు శానిటరీ సెక్రటరీ వున్నప్పటికీ పారిశుధ్య పనులు అస్తవ్యస్తంగా సాగేవి. కూటమి ప్రభుత్వం వచ్చినా నేటికి ఇంకా అదే పరిస్థితి కొనసాగుతోంది.

పాడైపోయిన కంపాక్టర్ బిన్స్..: ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పారిశుధ్య పనులకు అవసర మైన పనిముట్లు అందజేయడంలో మున్సిపల్ పాలక మండలి అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. అందులవల్ల ప్రొద్దుటూరు పట్టణంలోని నాలుగు శానిటరీ డివిజన్ల పరిధిలోని చెత్త పాయింట్ల వద్ద కంపాక్టర్ బిన్స్ పూర్తిగా పాడయినవి వున్నాయి. మరి కొన్నిచోట్ల అవి కూడా లేక రోడ్లపైనే చెత్త పాయింట్లు పెట్టారు. కంపాక్టర్ బిన్స్ పాడవడంతో చెత్త కుప్పలను మొత్తం పారలు, గంపలు పెట్టి ఎత్తవలసి వస్తోంది. దీంతో ఆవులు, పందులు ఆ కుప్పలను ఆపరి శుభ్రం చేస్తున్నాయి.

బంద్ అయిన క్లాప్ ఆటోలు...: వైసీపీ ప్రభుత్వం లో వున్న క్లాప్ ఆటోలు నేడు మున్సిపాలిటీల్లో పూర్తిగా బంద్ అయ్యాయి. దీంతో మున్సిపాలిటీలో పట్టణంలో చెత్త కలెక్షన్‌ను పుష్ కాట్‌ల ద్వారా బిన్స్ ఏర్పాటు చేసుకుని ఇంటింటి కసువు సేకరణ చేపడుతున్నారు.అయితే కేవలం నాలుగు డివిజన్లకు సరిపడ పుష్‌కాట్లు లేవు. కొన్నింటిని కమిషనర్ ఆదేశాలతో మరమ్మతులు చేయించి వాడుతున్నారు. అలాగే కాలువలో సిల్ట్ తీశాక అది తరలించడానికి తగినన్ని వీల్ బార్స్ కూడా లేవు.పుట్ కాట్‌లలో వాడే ప్లాస్టిక్ బిన్స్ కూడా కొత్తవి కొనుగోలు చేయాల్సివుంది.

వాహనాల కొరత..: క్లాప్ ఆటోలు బంద్ కావడంతో చెత్తను కంపోస్టు యార్డుకు తరలించడానికి కొన్ని ఆటోలు ట్రాక్టర్లుకూడా కొరత ఉంది. వీటిని 15 ఫైనాన్స్ నిధులతోనైనా కొనుగోలు చేస్తేనే ప్రొద్దుటూరు పారిశుధ్య మెరుగుకు అవకా శాలున్నాయి.

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం

ప్రొద్దుటూరులో పారిశుధ్య మెరుగుకోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. కంపాక్టర్ బిన్స్‌ను 15 వ ఫైనాన్స్ నిధులతో 80వరకు కొనుగోలు చేస్తున్నాం. క్లాప్ ఆటోలు బంద్ అయినా ప్రతి వార్డులో పుష్‌కార్టులు పెట్టి 90 శాతం ఇంటింటి కసువు సేకరణ చేపడతున్నాం. చెత్త పాయింట్లలో సకాలం లో చెత్తను కంపోస్టు యార్డుకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వాహనాల కొరతను తీర్చడానికి కొత్త వాహనాలు కూడా కొనుగోలు చేస్తాం.

మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్.

అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

బద్వేలు , డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అమరవీరులు అందించిన త్యాగం చిరస్మరణీయమని విశ్రాంత సైనికోద్యోగుల సంఘం అధ్యక్షుడు కోనేటి రామకృష్ణయ్య, ఉపాధ్యక్షుడు మూర్తి పెంచలయ్య, రాష్ట్రపతి అవార్డు గ్రహీత గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. సోమవారం విజయ్ దివస్‌ను పురస్కరించుకుని స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని అమరవీరుల స్థూపం వద్ద మాజీ సైనికోద్యోగుల సంఘం ,రాచపూడి నాగభూషణం కళాశాల ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో మాజీ సైనిక సభ్యులు శ్రీనివాసులు, మద్దిలేటి క్రిష్టఫర్, రామిరెడ్డి, మనోజ్ , తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం విరాళాల సేకరణ

బద్వేలు రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సీపీఎంకు విరివిగా విరాళాలు అందించి ప్రజాపోరాటాలను బలపరచాలని సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. జనవరి 4, 5 తేదీల్లో కడప నగరంలో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభల జయప్రదం చేయాలని ఉద్యమనిధి ఇంటింటి మాస్‌క్యాంపెయిన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు చిన్ని, మోక్షమ్మ, రాయప్ప, అనంతమ్మ, ఖైరూన్‌బీ, కొండయ్య, రాజగోపాల్, మస్తాన్ పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిల చెల్లింపులు ఎప్పుడు.?

కలసపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయ అత్యావసరాల నిమిత్తం పొదుపు చేసుకున్న సొమ్మును చెల్లించకుండా నెలలు, సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచడం అన్యాయమని ఎస్టీయూ అధ్యక్షుడు సి. వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి బీవీఎన్ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం కలసపాడులోని మండల శాఖ అధ్యక్షుడు సి.వెంకటరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్‌లీవ్, మెడికల్ రీఎంబర్స్‌మెంట్, ఆయాల జీతాలు,సీసీహెచ్ తదితర బిల్లుల చెల్లింపులో తీవ్రజాప్యం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శేఖర్‌బాబు, అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్.వి సత్యనారాయణ, జిల్లా మహిళా కమిటీ కన్వినర్ కవిత, శివారెడ్డి, బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మృత్యుంజయ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం అగస్త్యేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థంగోపూజ, గణపతి, నవగ్రహ, ఉపదేవతా హోమాలు, మృత్యుంజయ హోమంను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. డీఎస్పీ భక్తవత్సలం దంపతులు పాల్గొని హోమం చేశారు. ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈవో రామచంద్రాచార్యులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు, మోటారు వాహనాల కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆటోడ్రైవర్స్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యేనంద్యాల వరదరాజులరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆటో వర్కర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు రామయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడులు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు, మోటారు వాహనాల కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ పట్టణ ప్రధాన కార్యదర్శి హరి, పట్టణాధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో ఆ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలకుఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పాండురంగన్‌రవి తెలిపారు. సోమవారం విశాఖపట్నానికి చెందిన టాలెంట్ ల్యాబ్ సంస్థ బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్ ఉద్యోగాలకోసం క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించింది. కళాశాలకు చెందిన ఎంబీఏ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. విజయ్‌కుమార్, సంధ్య, దినేష్, సైఫుల్లా, కౌసర్‌నయూమ్, అబీజ్, శరణ్య, అబ్దుల్లా, గైబున్నీసా, మహమ్మద్ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వీరికి సంవత్సరానికి రూ.4 నుంచి 7 లక్షల వేతనం లభిస్తుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైనవారిని ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు వీరకుమార్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఉప్పాగులో బస్‌స్టాప్ ఏర్పాటు

ప్రొద్దుటూరు , డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మండలం గోపవరం గ్రామ పంచాయతీలోని ఉప్పాగు వద్ద బస్‌స్టాప్ ఏర్పాటు చేయనున్నారు. ఆమేరకు సోమవారం నిర్మాణపనులను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రారంభించారు. పొట్టిపాడు, అర్కటవేముల పర్లపాడు గ్రామాలకు లింకు వున్న ఈ రహదారిలో బస్‌స్టాప్ వల్లప్రయాణికులకు మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పొట్టులక్ష్మీరెడ్డి టీడీపీనేత బచ్చల వీరప్రతాప్, ఆవులరాజ్వేరరెడ్డి, అల్లాబకాష్, జయరామిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, కుళ్ళాయప్ప, సుభాష్ మధు రమణ పాల్గొన్నారు.

నేడు విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం

జమ్మలమడుగు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో మంగళవారం జాతీయ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జమ్మలమడుగు అధ్యక్షుడు దేవదానం తెలిపారు. 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న విశ్రాంత ఉద్యోగులను సత్కరిస్తామన్నారు. జమ్మలమడుగు తాలూకా యూనిట్ విశ్రాంత ఉద్యోగులు ఉదయం 9.30 గంటలకు జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనం వద్దకు హాజరుకావాలన్నారు.

'కాలువ నిర్మాణ పనులను ఆపేయండి'

ప్రొద్దుటూరు ,డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని మైదుకూర ఎరోడ్డులో చేపడుతున్న కాలువ నిర్మాణ పనుల ను వెంటనే ఆపేయా లని తహసీల్దారు గంగ య్య పంచాయతీ రాజ్ ఇంజనీర్లను ఆదేశించారు. సోమవారం ఆయన ఆర్టీసీ బస్టాండ్ నుంచి సినీహబ్ వెళ్లే రోడ్డు మలుపు వరకు మైదుకూరు రోడ్డు విస్తరణ పనులను ఆర్‌అండ్‌బీ డీఈ లక్ష్మీనరసింహులుతో కలిసి పర్యవేక్షించారు. ఈ పర్యవేక్షణలో రెవెన్యూ సర్వేయర్లు ఇచ్చిన రోడ్డు మార్కింగ్ ప్రకారం కాకుండా అడ్డదిడ్డంగా విస్తరణ పనుల్లో కట్టడాల తొలగింపు చేపట్టడంపై తహసీల్దారు గంగయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా చాలా కట్టడాలకు ఇచ్చిన మార్కింగ్ ప్రకారం కాకుండా 3 అడుగులనుంచి 12 అడుగుల వరకు తగ్గించి కట్టడాలు తొలగించారు. ఇందుకు పీఆర్‌ఏఈ భరత్ సమాధానమిస్తూ కాలువ చక్కగా నిర్మించడంలో కొన్ని కట్టడా లు తొలగించకుండా వదిలేసి నిర్మాణం చేపట్టారన్నారు. ఇందుకు ఆర్‌అండ్‌బీ డీఈ లక్ష్మీనరసింహులు తహసీల్దారు గంగయ్య అంగీకరించక తక్షణం పనులు ఆపేయాలని ఏఈని ఆదేశి ంచారు. అంతేకాకుండా మార్కింగ్ ఎక్కడి వరకు ఇచ్చామో అక్కడి వరకు రోడ్డు విస్తరించి కాలువ చేపట్టాలని ఆదేశించారు.దీంతో పీఆర్ ఏఈ భరత్ కాంట్రాక్టర్‌ను కాలువ పనులు నిలుపమని తెలిపారు.

'సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలి'

బద్వేలు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బద్వేలు మండలం, సి.కొత్తపల్లె గ్రామ పొలం సర్వే నెం.54/1 నుంచి 54/6 వరకు కబ్జాదారులకు అనుగుణంగా కొలతలు వేసిన సర్వేయర్ పై చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డి. వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ విషయమై సంబంధిత సర్వేయర్‌ను కోరినా తనకేమీ పట్టనట్లు వ్యవహరించడంతోపాటు పై అధికారులకు తెలియజేసినా తనకేమీ ఇబ్బంది లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రూరల్ అధ్యక్షురాలు సునీత, కార్యదర్శి సరస్వతి, కేవీపీఎస్ మండల కార్యదర్శి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

పోరుమామిళ్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్ల గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ యనమల సుధాకర్ అన్నారు. సోమవారం స్థానిక పంచాయితీ కార్యాలయంలో సమగ్ర గ్రామఅభివృద్ధి ప్రణాళికా సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్లకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం హయాంలో మహర్దశ వచ్చిందన్నారు. ఉపాధిహామీ పథకం కింద దశలవారీగా రూ.3కోట్ల రూపాయలు ఖర్చుచేసి సిమెంట్‌రోడ్లు, గోకులాల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. మొదటి విడతగా రూ.50లక్షలు మంజూరు చేసిందని, సిమెంట్‌రోడ్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. కార్యనిర్వాహణాధికారి రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు సాగుభూమి ఇవ్వాలి

బద్వేలు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వం 2 ఎకరాల సాగుభూమి ఇచ్చేంతవరకు పోరాటం ఆగదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద దళితహక్కుల పోరాట సమితి, ఏపీ గిరిజన సమాఖ్య, దళిత డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య, ఇమ్మానుయేల్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు